ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

శనివారం 22, నవంబరు 2025

మెప్మాలో ఉలికిపాటు!



- అవినీతి బహిర్గతం కావడంతో బాధ్యుల్లో వణుకు
- బోగస్ గ్రూపులు సృష్టించిన ఆర్పీల్లో భయం
- సహకరించిన కార్యాలయ సిబ్బంది మల్లగుల్లాలు
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న బాగోతాలు



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వీటిపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమవుతోంది. దీంతో రూ.కోట్లు స్వాహా చేసిన ఆర్పీలు, వారి వద్ద ముడుపులు తీసుకొని సంపూర్ణ సహకారం అందించిన అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది. గత కొన్నేళ్లుగా బోగస్ గ్రూపులతో పొదుపు మహిళల పేరుతో రూ.కోట్ల దోపిడీ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. తాజాగా కార్యాలయంలోని సీవోలు, కొందరు సిబ్బంది, చివరికి ముఖ్యఅధికారి అవినీతి వ్యవహారాలు బహిర్గతమవుతున్నాయి. ఆర్పీల చేతిలో మోసపోయిన

మిగతా 6వ పేజీలో

మొక్కజొన్న రైతుకు కష్టం!

- తుఫాన్ సమయం నుంచి ఆరని చేలు
- పొలాల్లోకి వెళ్లలేకపోతున్న కోత మిషన్లు
- రాలుతున్న కండెలు, అప్పే మొలకలు
- భారమైనా కూలీలతో కోయిస్తున్న కర్షకులు
- మద్దతు ధర రూ.2,400, ప్రైవేట్ వ్యాపారులు రూ.1,800కు కొనుగోలు

7



ఇలవర (నేతివారిపాలెం) గ్రామం వద్ద గోతులమయమైన ఆర్అండ్బీ రోడ్డు

రహదారుణం

జిల్లాలో రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికశాతం రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులకు చుక్కలు చూపెడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్వహణ విషయంలో చూపిన నిర్లక్ష్యం నేటికీ వెంటాడుతోంది. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లపై దృష్టి సారించి మరమ్మతులు చేయించింది. అయినా ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్‌తో అవి మరింత ఛిద్రమయ్యాయి. ఏ ప్రాంతంలో చూసినా భారీగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలిగించేవే అధికంగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్లే కాకుండా మండల కేంద్రాల మధ్యన.. అలాగే ప్రధాన పట్టణాలు, హైవేలను కలిపే ఇతర రహదారుల పరిస్థితి సైతం దారుణంగా ఉంది. ఈ విషయం జిల్లాలో 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలనలో స్పష్టంగా కనిపించింది.

- ప్రయాణం నరకప్రాయం
- జిల్లాలో ధ్వంసమైన రోడ్లు
- మొంథా తుఫాన్‌తో ఘోరంగా పరిస్థితి
- అనేక ప్రాంతాల్లో గుంతలమయం
- గ్రామీణ రోడ్లే కాక ప్రధాన రహదారుల పరిస్థితీ అంతే
- అవస్థలు పడుతున్న వాహనదారులు



గోతులమయమైన బసవాపురం-రెడ్డినగర్ రోడ్డు

ఒంగోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారులు దారుణంగా తయారయ్యాయి. ఎటుచూసినా గుంతలతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రధానంగా గ్రామీణ రోడ్లు పూర్తిగా నామరూపాల్లేకుండా పోయాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్బీ రోడ్ల పరిస్థితి కూడా దాదాపు అలాగే ఉంది. జిల్లాలో ఆర్అండ్బీ శాఖ పరిధిలో మూడు డివిజన్లు, తొమ్మిది సబ్ డివిజన్లు ఉన్నాయి. వాటి పరిధిలోకి మొత్తం 2,684 కి.మీ రహదారులు వస్తాయి. అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో 580 కి.మీ ఉండగా దర్శిలో 474.22 కి.మీ, కనిగిరిలో 405.90 కి.మీ ఉన్నాయి. ఇక పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 5,554 కి.మీ రహదారులు ఉన్నాయి. ఇవికాక జాతీయ రహదారుల పరిధిలో పలు కీలక రోడ్లు ఉన్నాయి. కాగా కేంద్రప్రభుత్వ ఆధీనంలోని జాతీయ రహదారులలో అక్కడక్కడా కొద్దిమేర తప్ప అత్యధికభాగం బాగానే ఉండగా ఆర్అండ్బీ శాఖ పరిధిలోని రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వం ఆ శాఖను నిర్లక్ష్యం చేసి రోడ్ల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో జిల్లాలోని అనేక ఆర్అండ్బీ రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి.

ప్రజాప్రభుత్వం రాగానే మరమ్మతులు

ఆ పరిస్థితిని గుర్తించిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని రోడ్ల పథకం పేరుతో ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయించింది. జిల్లాలో ఆర్అండ్బీ పరిధిలో ఉన్న 2,684 కి.మీ రహదారులలో దాదాపు 2,020 కి.మీ దెబ్బతిన్నట్లు గుర్తించి అందులో తక్షణ అవసరంగా భావించిన 1,453 కి.మీ

మిగతా 6వ పేజీలో



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కోతకు గురైన ఈదుమూడి-ఎం.ముప్పాళ్ల రోడ్డు



అధ్వానంగా ఉన్న త్రిపురాంతకం-ఎర్రగొండపాలెం రోడ్డు



గుంతలమయంగా ఉన్న పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు



కంభం చెరువుకు వెళ్లే మార్గంలో చప్టా వద్ద పడిన పెద్దగుంత

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి



మత్స్యకారుల కుటుంబాలకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు

- ఆదాయం మరింత పెంపునకు చర్యలు
- మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. రాష్ట్రానికి మత్స్యసంపద కీలక ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో దాన్ని మరింత విస్తృతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. మత్స్య సంపద ద్వారా ఆదాయ ఆర్జనలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో కొనసాగుతున్నదని చెప్పారు. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆక్వా సాగుకు

మిగతా 6వ పేజీలో

నేడు ఉపాధి పథకం గ్రామసభలు

అన్ని పంచాయతీల్లో ఒకేరోజు నిర్వహణ

ఈకేవైసీ లోపాల సవరణ, కొత్త జాబ్ కార్డులు

ఒంగోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం ఉపాధి హామీ పథకం గ్రామ సభలు జరగనున్నాయి. అన్ని పంచాయతీల్లో ఒకే రోజున వీటిని నిర్వహిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలతో డ్వామా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల కేంద్రం ఆదేశాలతో ఉపాధి కూలీల జాబ్ కార్డులన్నింటికీ ఈకేవైసీ చేశారు. జాబ్ కార్డులు ఉండి అందుబాటులో లేని కూలీలు, వలస వెళ్లిన వారు, మృతులు ఇలా రకరకాల కారణాలతో రాష్ట్రంలో పెద్దఎత్తున జాబ్ కార్డులు రద్దయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఉన్న జాబ్‌కార్డుల్లో దాదాపు 15 లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదని సమాచారం. అలాంటి వారందరికీ ఇక ఉపాధి పథకం

మిగతా 6వ పేజీలో

ఘర్షణపడిన హోంగార్డులపై వేటు

ఇద్దరు సస్పెన్షన్, వీఆర్‌కు ఒకరు

విచారణకు ఆదేశించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కవచ్ బందోబస్తుకు వచ్చి మద్యం సేవించి ఘర్షణ పడిన ముగ్గురు హోంగార్డులపై వేటు పడింది. వారిలో ఇద్దరిని సస్పెండ్ చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, మరొకరిని వీఆర్‌కు పిలిచారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. సాగర్ కవచ్‌లో భాగంగా ఒంగోలులో విధులు నిర్వహించేందుకు వచ్చిన హోంగార్డులు తంగిరాల ప్రశాంత్‌కుమార్, చెరుకూరి బాలసుబ్రమణ్యం, షేక్ యాసిన్ నగరంలోని ఓ లాడ్జిలో బస చేశారు. ఈనెల 19వతేదీన మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. దీంతో ఎస్పీ వారిపై చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణ ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మార్చి 16 నుంచి ప్రారంభం

ఒంగోలు విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఆ ప్రకారం మార్చి 16వతేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజీ (గ్రూపు-ఎ) పరీక్ష ఉంటుంది. 18న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1, 20న ఇంగ్లీషు, 23న లెక్కలు, 25న ఫిజికల్ సైన్స్ 28న బయోలాజికల్ సైన్స్, 30న సోషల్, 31న ఫస్ట్ లాంగ్వేజ్-2, సంస్కృతం, అరబిక్, ఏప్రిల్ 1వ తేదీన ఓఎస్ఎస్‌సీ మెయిన్, ఒకేషనల్ కోర్సు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు.

జీజీహెచ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రిని తనిఖీ చేసిన అధికారులు
- రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న వైనం

7

ఘనంగా పోలిపాడ్యమి



కొప్పోలు చెరువు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) దీపాన్ని నీటిలో వదులుతున్న యువతి



కార్తీక మాసం ముగింపు సందర్భంగా పోలిపాడ్యమిని శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అరటిదొప్పలలో దీపాలను వెలిగించి దానికి పసుపు, కుంకుమతో పూజ చేసి దగ్గరలోని నీటి ప్రవాహాల్లో వదిలారు. పోలిని స్వర్గానికి పంపుతున్నట్లుగా వారు భావించారు. తాము సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని సర్వేశ్వరుడిని ప్రార్థించారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్



సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇతర అధికారులు

ఎలక్ట్రిక్ టగ్ బిల్డింగ్ శంకుస్థాపనకు సీఎంకు ఆహ్వానం

● మారిటైంబోర్డు ఆధ్వర్యాన త్వరలో కాకినాడలో రూ.80 కోట్లతో నిర్మాణం

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మారిటైంబోర్డు ఆధ్వర్యంలో కాకినాడలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఎలక్ట్రిక్ టగ్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి ఈనెల 29న రావాలని ఆహ్వానిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడిని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, శాన్‌మారిటైం ఇండియా షిప్ బిల్డింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఎస్‌కె.అహ్మద్ ఆలీషా శుక్రవారం రాత్రి కలిసి ఆహ్వానించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో భాగంగా, మేకిన్ ఇండియా పాలసీలో భాగంగా దేశంలోనే తొలిసారిగా కాకినాడ పోర్టు వద్ద కంపెనీ ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ నౌకల తయారీని అందుబాటులోకి తేనున్నారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగావకాశాలు లక్ష్యంగా ఈ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. నౌకాయాన రంగంలో పర్యావరణ హితమైన, కార్బన్ ఉద్గారాలను తగ్గించే సాంకేతికతతో సాన్ మారిటైమ్ కంపెనీ దేశంలోని ప్రముఖ మెరైన్ డిజైన్ సంస్థలు, సమగ్ర మెరైన్ ఎలక్ట్రిక్ సొల్యూషన్ ప్రొవైడర్లు, ఎలక్ట్రిక్ మొబిలిటీ టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం చేసుకుని ఎలక్ట్రిక్ నౌకలను నిర్మించనుందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు సత్య, అహ్మద్ ఆలీషా వివరించారు.

నేడు డ్వాక్రా మహిళలకు మెగా రుణమేళా

● పాల్గొననున్న మంత్రి స్వామి, సత్య

కొండపి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ- వెలుగు ఆధ్వర్యంలో కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల స్థాయిలో శనివారం ఉదయం స్థానిక కామేపల్లి రోడ్డులోని సాయిసీతారామ కల్యాణమండపంలో డ్వాక్రా మహిళలకు రూ.7 కోట్లకుపైగా మెగా రుణమేళా, యూనిట్లు పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నారు.


● కార్యక్రమానికి దాదాపు వెయ్యి మంది మహిళలు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమేరకు శుక్రవారం ఏర్పాట్లను ఎంపీడీవో బి.రామాంజనేయులు, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

● జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు(రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్ల యజమానులు పూర్తిగా సహకరించాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో రబీసీజన్‌లో 25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందని, దీనిని కొనుగోలుకు గోదాములు సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు తరువాత రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో44 రైతు సేవాకేంద్రాలు, 26 సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాంభించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, రైస్‌మిల్లర్స్ సంఘ ప్రతినిధి శ్రీనివాసరావు, మిల్లర్లు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి నిధుల కోసం వినతి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందరన్భంగా నగర అభివృద్ధి కోసం నిధులు అవసరతను తెలియజేశారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ, నల్లకాలువ, కొత్తపట్నం బీచ్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబును కలిపి విన్నవించిన ఎమ్మెల్యే ముత్తుముల



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంకు చెందిన పలు సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో గత నెలలో బీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ వలన గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో పలు చెరువులు, రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, వాటి కోసం అత్యవసర నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 4,379 రైతులకు సంబంధించి 1,844.21 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

పశు పోషకులకు దాణా పంపిణీ

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల, ఈదర పశు వైద్యశాలలోని పశు పోషకులకు 50 శాతం సబ్సిడీపై మంజూరైన దాణాను శుక్రవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కాసిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బుర్రి అంజయ్య, ఎంపీటీసీ సభ్యుడు పాలపర్తి సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎల్‌పురం రహదారిపై ప్రమాదాల పరంపర

● ట్రాలి క్యాబిన్ ఊడిపోయి కిందపడిన గ్రానైట్ రాళ్లు



రామతీర్థం-ఆర్‌ఎల్ పురంల మధ్య జారి పడిన గ్రానైట్ రాళ్లు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించిన ప్రాంతంలో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. రామతీర్థం నుంచి ఆర్‌ఎల్‌పురంనకు వెళ్లే రహదారికి ఇరువైపులా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ రహదారి గుంతలమయమై అధ్వానస్థితికి చేరుకోవటంతో రవాణా కష్టతరంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఇక భారీ లోడుతో వెళ్తున్న గ్రానైట్ ట్రాలీలు గుంతల్లో పడి బోల్తా పడటం పరిపాటిగా మారింది. ఇటీవల ఇలాంటి సంఘటన చోటుచేసుకొని తృటిలో ప్రాణప్రమాదం తప్పిపోయింది. ఈ సంఘటన మరచిపోకముందే శుక్రవారం రాళ్ల లోడుతో వెళ్తున్న మరో ట్రాలీ గుంతల ప్రభావంతో క్యాబిన్ ఊడిపోయి ట్రాలీలో ఉన్న రాళ్లు రోడ్డుపై జారిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఇలా తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అయినా పాలకులు కళ్లు తెరచి రహదారికి మరమ్మతులను తక్షణమే నిర్వహించాలని ఈ ప్రాంతవాసులు, వాహనదారులు, పరిశ్రమవర్గాలు కోరుతున్నారు.

పంచాయతీ ఖజానాలో రూ.20కోట్లు..

ఆర్‌ఎల్‌పురం పంచాయతీ పరిధిలో గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించి ఉన్నాయి. వీటినుంచి ప్రభుత్వం రాయల్టీ వసూలు చేస్తుంది. ఈ వసూలు అయిన రాయల్టీ డబ్బుల్లో కొంతమేర పంచాయతీకి సెస్ రూపంలో సమకూరుతుంది. ఇలా జమ అయిన నిధులు రూ.20కోట్లకు పైగా పంచాయతీ ఖజానాలో ఏడాదిన్నరకు పైగా మూలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ పాలకవర్గం ఈ నిధులతో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేసింది. ఈపనుల్లో రామతీర్థం-ఆర్‌ఎల్‌పురం రహదారి శాశ్వతప్రాతిపదికపై పునర్నిర్మాణం కూడా ఒకటిగా ఉంది. అయినా ఈ పనుల నిర్వహణకు టెక్నికల్ అనుమతులు అధికారులు మంజూరు చేయలేదు. ఇప్పటికైనా వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు రాకముందే అధికారులు అభివృద్ధి పనులు చేపట్టటానికి అనుమతులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెప్మాలో ఉలికిపాటు

(5వ పేజీ తరువాయి)

పొదుపు మహిళలు మెప్మా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారి మొర ఆలకించేవారు కరువయ్యారు. 'ఆంధ్రజ్యోతి' కథనాలను ఆసరా చేసుకొని ఆ సంస్థ అధికారి ఆర్పీలను బెదిరించి భారీగానే వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒకరిపై ఒకరు నిందలు.. వాస్తవాలు వెలుగులోకి

మెప్మాలో చోటుచేసుకున్న అవినీతిపై రెండు రోజులుగా పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది. సునీల్ అనే కాంట్రాక్టు ఉద్యోగి ఆఫీసు నిధులను డ్రా చేసి మోసం చేశాడని పోలీసులకు పీడీ శ్రీహరి ఫిర్యాదు చేయడంతో సునీల్‌ను వారు అదుపులోకి తీసుకున్నారు. అతను మెప్మాలో అవినీతి వ్యవహారాలను ఒక్కొక్కటిగా బహిర్గతం చేస్తున్నాడు. అన్నీ పీడీ కనుసన్నల్లోనే జరిగాయని వెల్లడిస్తున్నట్లు తెలిసింది. దీంతో అవినీతి వ్యవహారాలకు పాల్పడిన వారు వాటిని కప్పి పుచ్చుకునేందుకు, వాటి నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రూ.4.45 లక్షలు సునీల్ కాజేశాడని పీడీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా.. అతను ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించినట్లు సమాచారం. అయితే సునీల్‌పై పీడీ మరికొన్ని కేసులు పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కార్యాలయంలో కంప్యూటర్లు పోయాయని మరోసారి కేసు పెట్టాలని పోలీసులపై పీడీ ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ఆధారాలు చూపాలని, కంప్యూటర్‌లకు తనకు సంబంధం ఏమిటని సునీల్ ప్రశ్నించడంతో పీడీ వెనక్కు తగ్గినట్లు సమాచారం. మరోవైపు మెప్మాను గాడిన పెట్టడంపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక దృష్టి సారించారు. గత ప్రభుత్వ హయాంలోనూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరైన రుణాలు, బోగస్ రుణాలపై ఆయన విజిలెన్స్ విచారణ కోరారు. దీంతో మెప్మా కార్యాలయంలో కలవరం మొదలైంది.

మెప్మా గాడిన పడేనా?

గత వైసీపీ హయాం నుంచి మెప్మాలో బోగస్ గ్రూపుల బాగోతం మొదలైంది. నేటికీ అది కొనసాగుతోంది. దీంతో పొదుపు సభ్యులకు తీరని నష్టం వాటిల్లుతోంది. వారి పేరుతో రుణాలు పొందిన వారు దర్జాగా ఉంటున్నారు. ఏమీ తెలియని వారికి రూ.లక్షలు బకాయి ఉన్నాయంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వస్తుండటంతో బాధితులు బోరుమంటున్నారు. విజిలెన్స్ విచారణతోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తే తమకు న్యాయం జరుగుతుందని బాధిత పొదుపు సభ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎలాంటి అవినీతీ చోటుచేసుకోలేదు

- పి.శ్రీహరి, మెప్మా పీడీ

మెప్మాలో అవినీతి జరిగిందంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. తాను బాధ్యతలు తీసుకోకముందు బోగస్ గ్రూపులను సృష్టించి రుణాలు తీసుకున్న కొందరు ఆర్పీలను అప్పట్లోనే తొలగించారు. మరలా ఇటీవల కాలంలో కొందరు బోగస్ గ్రూపులు సృష్టించారని నా దృష్టికి వచ్చింది. అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని నేనే స్వయంగా ఎస్పీకి లేఖ రాశా. కొందరు ఆర్పీల వద్ద నుంచి నేను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. పొదుపు మహిళలకు రుణాలు మంజూరు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం.

ఎంతటివారైనా వదిలేది లేదు : ఎమ్మెల్యే దామచర్ల

మెప్మాలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలలో బాధ్యులు ఎంతటివారైనా వదిలేది లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. పట్టణ పొదుపు మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం అనేక రకాలుగా రుణాలు అందించి ఆదుకుంటున్నదన్నారు. వాటిని కొందరు స్వప్రయోజనాలకు వాడుకుంటూ అర్హులైన లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. దీనిపై తాను స్వయంగా మంత్రి నారాయణను కలిసి విజిలెన్స్ విచారణ కోరినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేసిన రుణాలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

రహ'దారుణం'

(5వ పేజీ తరువాయి)

రోడ్లకు రూ.13.76 కోట్లతో తొలి విడత అలాగే మరో 5,66.86 కి.మీ. రూ.11.40 కోట్లతో మరమ్మతులు గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు చేయించారు. మంజూరు చేసిన పనులలో 90శాతం పూర్తయ్యాయి. అలాగే పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోనూ సుమారు రూ.37.99 కోట్లతో 70 పనులు చేపట్టారు. దీంతో గత ఏడాది నుంచి కొంతమేర రోడ్లపై ప్రయాణానికి ఇబ్బంది లేకుండా సాగుతోంది.

దెబ్బతీసిన మొంథా తుఫాన్

ఇటీవల జిల్లాను ముంచెత్తిన మొంథా తుఫాన్ రోడ్లను ధ్వంసం చేసింది. అత్యధిక శాతం గండ్లుపడటం, కోతకు గురికావడంతోపాటు గతుకులు, గోతులమయంగా మారాయి. ఆర్‌అండ్‌బీ, పీఆర్ తేడా లేకుండా అన్నిరకాల రోడ్లు అలా దెబ్బతినగా తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడ జాతీయరహదారులకు సైతం నష్టం వాటిల్లింది. మరోవైపు అనేక రోడ్లపై ఉన్న కల్వర్టులు, చిన్న చిన్న వంతెనలు సైతం ధ్వంసమయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో సుమారు రూ.180.66 కోట్ల మేర ఆర్‌అండ్‌బీ, రూ. 70.41 కోట్ల మేర పీఆర్ వెరసి దాదాపు రూ.251.76 కోట్ల మేర రోడ్లకు నష్టం వాటిల్లింది. ఆ ప్రభావం ప్రస్తుతం రహదారులపై ప్రయాణిస్తున్న వారు అనుభవిస్తున్నారు. పలు రోడ్లపై వాహనచోదకులు ముందుకు పోలేక అల్లాడుతున్నారు. సాధారణంగా పావుగంటలో ప్రయాణించే దూరం ప్రస్తుతం గంట పడుతున్న పరిస్థితి పలు చోట్ల కనిపిస్తోంది. అంతేకాక వాహనాలు ధ్వంసమవుతున్నాయి.

మరమ్మతులు చేసినవీ పాడయ్యాయి

ఆయాప్రాంతాలలో పరిశీలిస్తే.. వైపాలెం నుంచి త్రిపురాంతకం వెళ్లే రోడ్డు, దోర్నాల నుంచి ఆత్మకూరు నల్లమల ఆటవీ ప్రాంతంలో నుంచి వెళ్లే రోడ్డు, మార్కాపురం నుంచి తర్లుపాడు వెళ్లే రోడ్డు, బేస్తవారపేట నుంచి కోనపల్లి వెళ్ళే రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. కడప- విజయవాడలో పోరుమామిళ్ల నుంచి తాటిచెర్ల మోటు వరకు, టంగుటూరు-పొదిలి రోడ్డులో మర్రిపూడి వద్ద అలాగే పెట్లూరు వద్ద కొన్ని కి.మీ, వెల్లంపల్లి- తాళ్లూరు రోడ్డులో శివరాంపురం ప్రాంతం వద్ద దర్శి నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో చిలకలేరు ప్రాంతంలో, ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై త్రోవగుంట నుంచి ఉప్పుగుండూరు వరకు, ఒంగోలు- పొదిలి రోడ్డులో గ్రానైట్ క్వారీల ప్రాంతం, ఎస్ఎన్‌పాడు-కొండపి మార్గంలో మద్దులూరు ప్రాంతంలో, ఒంగోలు-కొత్తపట్నం రోడ్డు, కనిగిరి -వేములపాడు రోడ్డు కంకర లేచిపోయి మట్టిరోడ్డును తలపిస్తోంది. ఇలా జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక గ్రామీణ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వివిధ మండల కేంద్రాల మధ్య అలాగే ఉన్నాయి. పలు రోడ్లకు మరమ్మతులు చేపట్టినా తుఫాన్‌తో కురిసిన భారీవర్షాలతో తిరిగి దెబ్బతిన్నట్లు చెప్తున్నారు. ఇక కొన్నిరోడ్లను ప్రభుత్వం ఇటీవల మంజూరుచేయగా వాటిని చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితిపై ప్రభుత్వం దృష్టిసారించాలని ప్రజానీకం కోరుతోంది.

నేడు ఉపాధి పథకం గ్రామసభలు

(5వ పేజీ తరువాయి)

పనులు కల్పించే అవకాశం లేకుండా పోయింది. మరికొంత మంది కొత్తగా జాబ్ కార్డులు కావాలని వివిధ సందర్భాలలో ప్రజాప్రతినిధులు, అధికారులను అడుగుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ఈకేవైసీ లోటుపాట్ల సవరణ, అర్హులైన వారికి కొత్త జాబ్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. తదనుగుణంగా జిల్లాలో 729 పంచాయతీలలో గ్రామసభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లాలో దాదాపు లక్ష మంది జాబ్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదు. అంటే జిల్లాలో ఉన్న సుమారు ఆరు లక్షల జాబ్ కార్డులలో ఇంచుమించు 15నుంచి 17శాతం వరకు ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. ఈనేపథ్యంలో అర్హతలు ఉండి సకాలంలో ఈకేవైసీ చేయించుకోలేకపోయిన వారికి ఈ గ్రామ సభల్లో వాటిని సరిదిద్దనున్నారు. అర్హులకు కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయడంతోపాటు కొత్తగా పని అవసరమైన వారి నుంచి వినతి పత్రాలు తీసుకొంటారు. వారికి పనుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

(5వ పేజీ తరువాయి)

ఒక్కో యూనిట్ రూ.1.5 చొప్పున విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఆక్వాకు సంబంధించి మరింత అధ్యయనం కోసం కాలేజీలలో ప్రత్యేక కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెడుతున్నదని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ వేట నిషేధం, ఇతర విపత్తుల్లోనూ మత్స్యకారులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అండగా నిలుస్తున్నదన్నారు. వేట నిషేధ సమయంలో రూ.20వేల ఆర్థిక సహాయం అందించడంతోపాటు తాజాగా వచ్చిన మొంథా తుఫాన్ సమయంలోనూ ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని తీరప్రాంతం వెంట చేపట్టిన పర్యాటక, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో ధరలను కూడా మత్స్యకారుల సమక్షంలోనే ఖరారు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు మత్స్యకార కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. పది మందికి లైఫ్ జాకెట్లు, ఐదుగురికి జీపీఎస్ సెట్లు, ఇద్దరికి పడవలు, ఇంజన్లు, వలలను ఇచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మత్స్యకార సంఘం అధ్యక్షుడు పేరయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చీమకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవరపాలెం పరిసరప్రాంతాల్లోని పొలాల్లో గల పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.18,620 నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు.

నేడు నూతన కోర్టు భవన సముదాయం ప్రారంభం

● హాజరుకానున్న హైకోర్టు న్యాయాధికారులు

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరుగనున్నట్లు ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి తెలిపారు. ఉదయం 11.00 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, జస్టిస్ వై.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్.భారతి హాజరుకానున్నారన్నారు.

ఎస్సీ కాంప్లెక్స్ రూములకు దరఖాస్తులు చేసుకోవాలి

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సెంటర్‌లోని ఎస్సీ కాంప్లెక్స్‌లోని 5 రూములకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను డిసెంబరు 10వ తేదీలోగా జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రగతి భవన్‌లోగల ప్రకాశం జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

తీరంలో సాగర్ కవచ్

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర మార్గం నుంచి అక్రమంగా మన దేశంలోకి చొరబాట్లను అడ్డుకోవడంతో పాటు అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు పోలీస్‌శాఖ చేపట్టిన సాగర్ కవచ్ విధులను మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో మెరైన్, స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించారు. చిన్నంగారిపట్టపుపాలెం తీరంలో మెరైన్ హోంగార్డ్ పోతురాజు ఆధ్వర్యంలో, కనపర్తి ప్రధాన కూడలి వద్ద పోలీసులు నిఘా విధులు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు వద్ద గురువారం ముందు వెళుతున్న మోపెడ్ వాహనాన్ని కారు ఢీకొనడంతో అమ్మనబ్రోలుకు చెందిన పాతెం శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలయ్యారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రెడ్డినగర్ వద్ద రోడ్డు ప్రమాదం

● చీమకుర్తి వాసి దుర్మరణం ● మరొకరికి తీవ్ర గాయాలు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం చీమలమర్రి సమీపంలో రెడ్డినగర్ వద్ద గల కర్నూల్‌రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకలు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ దాసరి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. రెడ్డినగర్ సమీపంలో కర్నూల్‌రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా వాహనాలు నడుపుతున్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న గ్రానైట్ కంటైనర్ కిందపడిన చీమకుర్తికి చెందిన ఏడుకొండలు(35) సంఘటనాస్థలంలో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. .గాయపడిన మరో వ్యక్తిని సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ప్రసాద్ తన వాహనంలో వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అండర్ - 14 బాల బాలికల ఖోఖో శిక్షణా శిబిరం



ఖోఖో శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నారాయణమ్మ

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల బాలికలకు వారం రోజుల పాటు జరిగే ఖోఖో శిక్షణను శుక్రవారం గ్రామ సర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరగనున్న పోటీలకు అవసరమైన శిక్షణను క్రీడాకారులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్‌ఎం మాధవీలత అధ్యక్షత వహించారు. ఆంధ్రా ఖోఖో అసోసియేషన్ మాజీ సెక్రటరీ మేకల సీతారామిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖోలో శిక్షణ ఇస్తామన్నారు. ముండ్లమూరులో శిక్షణకు ముందుకు రావటం పీడీ సోమశేఖరరెడ్డితో పాటు గ్రామస్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఆవుల సునీత, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లు చొక్కా శేషయ్య, వీరపనేని రాంబాబు, ఉపాధ్యాయులు ధూళిపాళ్ల వెంకటరావు, బేతపూడి లింగారావు పాల్గొన్నారు.

అష్టావధానంపై అవగాహన కల్పించాలి

● జడ్పీ మాజీ చైర్మన్ హరిబాబు

నాగులుప్పలపాడు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అష్టావధాన కళలు ఎంతో ప్రాముఖ్యమైనవని, వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలులో శతావధాని కైముది నారాయణంబాలసుబ్రహ్మంగారితో 381వ అష్టావధాన కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం సత్యవతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అష్టావధానం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కళల గురించి ఎవరైనా శిక్షణ పొందవచ్చని, తెలుగు భాషపై పూర్తిగా పట్టు పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాధికారి ఎ.చంద్రమౌళీశ్వరరావు, ఎంఈవోలు టి.రవి, ఈవీ.రమణయ్య, బాలాజీ, కవి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి భద్రత

● జడ్పీ సీఈవో చిరంజీవి

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని జడ్పీ సీఈవో బి.చిరంజీవి సూచించారు. ప్రభుత్వం చౌటపాలెం గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా ఎంపిక చేయడంతో ఎంపీడీవో తేళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో మాట్లాడుతూ చవటపాలెం గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కొనియాడారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్‌లుగా నియమించిందని చెప్పారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి జడ్పీ సీఈవో చిరంజీవి, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్ర, తదితరులు వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, బాపట్ల ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో సునీల్, సర్పంచ్ కాట్రగడ్డ వనజ, కాట్రగడ్డ శ్రీనివాసరావు, దొడ్డా సీతారామయ్య, ఈదర వెంకటకృష్ణారావు, చెన్నారెడ్డి కృష్ణ, కవిల వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మొలకెత్తిన గింజలతో ఉన్న కండెలను చూపుతున్న రైతు గాడిపర్తి లక్ష్మీనారాయణ

మొక్కజొన్న రైతుకు కష్టం!

- వెంటాడుతున్న తుఫాన్ నష్టం
- నేటికీ ఆరని చేలు.. వాగు సమీప పొలాల్లో ఇబ్బందులు
- రాలుతున్న కండెలు, ఆపై మొలకలు
- భారమైనా కూలీలతో కోయిస్తున్న కర్షకులు
- మద్దతు ధర క్వింటా రూ.2400, ప్రైవేట్ వ్యాపారులు రూ.1800కు కొనుగోలు
- మార్క్‌ఫెడ్, సొసైటీల ద్వారా కొనుగోలు చేయించాలంటున్న రైతులు

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్నను వెంటాడుతోంది. ముఖ్యంగా వాగు సమీప పొలాల్లో తడి ఎక్కువగా ఉండటంతో తుఫాన్ వర్షాలకు మొక్కజొన్న కండెలు విరిగిపడుతుండడంతో గింజలు మొలకెత్తాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొలాలు ఆరకపోవడంతో కండెల కోతకు మిషన్లు రాలేకపోతున్నాయి. దీంతో రైతులు కూలీల చేత కండెలు కోయిస్తుండటంతో అదనపు భారం పడుతున్నదని వారు వాపోతున్నారు.

గత రెండేళ్లు మొక్కజొన్న దిగుబడులు బాగా ఉండడం, మద్దతు ధర రూ.2200పైగా ఉండడంతో రైతుల పరిస్థితి ఆశాజనకంగా ఉంది. దీంతో ఈ ఏడాది మండలంలో 2,850 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. తుఫాన్ వర్షాల కారణంగా కోత దశలో ఉన్న పంట దెబ్బతింది. మొక్కజొన్నలోకి అక్కడక్కడా నీరుచేరి విత్తనం సరిగా లేక దిగుబడి ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లకు పడిపోయింది. ధర కూడా ప్రస్తుతం రూ.1800లకు పడిపోయింది. ఒక్కో ఎకరాకు రూ.35వేలకుపైనే పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం క్వింటా మద్దతు ధర రూ.2400గా ప్రకటించింది. ఎక్కడా ఆ ధరకు కొనడంలేదు.

తడి ఆరక చేలో కండెలు కోసేందుకు కుదరకపోవటంతో పంటను అలానే ఉంచుతున్నారు. అలా ఉంచి చివరకు నష్టమైనా క్వింటా రూ.1770 వేలకు అమ్ముతున్నారు. ఇలా ఒక్కో రైతు దాదాపు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు నష్టపోతున్నారు. మార్కెఫెడ్, సొసైటీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర రూ.2420లకు కొనుగోలు చేయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇంకొందరు పంటను పొలాల్లోనే కోయించి తేమ లేకుండా ఆరబెట్టేందుకు అల్లాడిపోతున్నారు.



తేమ మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

నాలుగు ఎకరాల్లో తీవ్రంగా నష్టపోయా



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. దాదాపు లక్ష రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టా. కండెలు కోద్దామనుకున్న సమయంలో వాన ముసురు పట్టింది. పంట పూర్తిగా నేలవాలింది. వర్షాలు తగ్గినా వాగు సమీపాన పొలం ఉండడంతో నీళ్లు పొలంలో ఉన్నాయి. దీంతో నేల తడిసి పోయి కండెలు నీట మునిగాయి. కండెలు మొక్కలు మొలిచి పనికి రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- గాడిపర్తిలక్ష్మీనారాయణ, శివరాంపురం

ధర తగ్గి నష్టపోతున్నాం



మొన్నటి వరకు రూ.2200 వరకు క్వింటా మొక్కజొన్నను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.1800లకు తగ్గింది. వాన ముసురు వల్ల దిగుబడి తగ్గింది. 3 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఈ లెక్కన ఎకరాకు దాదాపు రూ.14 వేలు నష్టపోవాల్సి వస్తుంది.

- లోకిరెడ్డి సుబ్బారెడ్డి, కొత్తపాలెం

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు



డ్రైవింగ్ లైసెన్స్ శిబిరంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్స్, ఎల్ఎల్ఆర్ మంజూరు కోసం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జేసీ ప్రారంభించి మాట్లాడారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌ల మంజూరులో తాము పడుతున్న ఇబ్బందులను గ్రీవెన్స్‌లో పలువురు దివ్యాంగులు తెలిపారన్నారు. దీనిపై స్పందించి ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 59 మంది దివ్యాంగులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇందులో రవాణా శాఖ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా ఎల్ఎల్ఆర్, లైసెన్స్ స్లాట్‌లను బుక్ చేసుకున్నారు.

స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ధార్తి మాతా బచావో అభియాన్ (భూమి మాత రక్షణ కార్యక్రమం) కింద ధార్తీ మాతా బచావో నిగ్రాణి సమితిని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఈ కార్యక్రమ విధివిధానాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ పథకాన్ని, జిల్లాలో పటిష్టంగా అమలు చేసే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్ (కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	232.00

జాతీయస్థాయి యోగా పోటీలకు ఉపాధ్యాయుడు రమణయ్య



రాష్ట్రస్థాయి పోటీల్లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయుడు రమణయ్య

పీసీపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు స్వర్ణ వెంకట రమణయ్య జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం ఉద్యోగులకు రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య ప్రతిభ కనబరిచారు. జాతీయ పోటీలకు ఎంపికైన రమణయ్యను జిల్లా క్రీడాధికారి రాజరాజేశ్వరి, ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, జి.సంజీవి అభినందించారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

- ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న ఎంఈవోలు



విద్యార్థినుల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈవోలు

కురిచేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు గ్రామంలోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు పమిడిపూల సురేష్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గురువారం కొద్దిమంది తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి సదరు ఉపాధ్యాయునితో ఘర్షణ పడ్డారు. ఈ విషయమై శుక్రవారం ఎంఈవోలు వస్రాంనాయక్, సుబ్బారావు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను విడివిడిగా విచారించారు. ఉపాధ్యాయుడు సురేష్ తమ పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని వారంతా ఏకరువు పెట్టారు. అతనిపై చర్యలు తీసుకోవాలని, అతను ఇక్కడ వద్దంటూ ఎంఈవోలకు తేల్చిచెప్పారు. ఈ విషయమై ఎంఈవో వస్రాంనాయక్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయునిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తమ విచారణలో తేలిందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ ఆదేశాలతో జీజీహెచ్‌ను తనిఖీ చేసిన అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం మెరుగు కోసం ఆసుపత్రి ఆవరణాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్వో ఓబులేశు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు జీజీహెచ్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో శుక్రవారం వారు ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ను తనిఖీ చేసి, అక్కడి పారిశుధ్యం, రోగులకు అందుతున్న సేవలు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులలో పర్యటించిన వారు, పలు వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటాన్ని గుర్తించారు. గత 17 సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యంగా చేయడం వల్ల వ్యర్థాలు పేరుకుపోయాయని వారు తెలిపారు. మునిసిపల్ అధికారులు, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న సేవలు, పారిశుధ్యం, తాగునీరు, ఆహారం సరఫరా, మందులు సరఫరా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యారావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ వారికి తగు ఆదేశాలు జారీ చేస్తూ, ఎక్కడ కూడా అపరిశుభ్ర వాతావరణం లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అద్దయ్య, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నిర్మల్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రావు పలువురు పాల్గొన్నారు.

యాంటీమైక్రోబియల్ అవగాహ ర్యాలీ

రిమ్స్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ యాంటీమైక్రోబియల్ అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు పాల్గొని మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ బాధ్యతాయుత వినియోగం, పెరుగుతున్న ఏఎంఆర్ ప్రమాదాలు, ఒన్ హెల్త్ దృక్పథంతో దాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.



జీజీహెచ్‌లో రోగులతో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేశు, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఎట్టకేలకు సర్టిఫికెట్లకు మోక్షం

- మార్కాపురం ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఎఫ్ఏసీ ఇచ్చిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత నెల 23వ తేదీ నుంచి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శివరామిరెడ్డికి ఎట్టకేలకు ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జి) ఇస్తూ జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలు జారీ చేశారు. నెల రోజులుగా బర్త్ సర్టిఫికెట్లు రాక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కష్టాలపై ఈ నెల 20వ తేదీన 'అగమ్యగోచరం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శుక్రవారం ఎఫ్ఏసీ ఇచ్చారు. ప్రభుత్వ విధుల్లో భాగంగా నిన్న విజయవాడలో ఉన్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి సాయంత్రం జిల్లా కేంద్రం ఒంగోలుకు వెళ్లి డీఎస్ (డిజిటల్ సిగ్నేచర్) తెచ్చుకున్నారు. కార్యాలయంలో నిలిచిపోయిన సుమారు 200కు పైగా వివిధ రకాలైన సర్టిఫికెట్లను శనివారం సాయంత్రానికే సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అప్‌లోడ్ చేశారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

గిద్దలూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీ కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈసంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోఉయ్యాలవాడ పంచాయతీ పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన జె.కాశయ్య (65) ప్రమాదవశాత్తు లారీ వెనుక టైర్ కిందపడి మృతి చెందాడు కాశయ్యకు భార్య, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

జిల్లా అకడమిక్ ఫోరం సభ్యుడిగా పిచ్చయ్య

కొమరోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మొర్రి పిచ్చయ్య డిస్ట్రిక్ట్ అకడమిక్ ఫోరం సభ్యుడిగా ఎంపికయ్యారు. జిల్లాలోని పాఠశాలల విద్యా ప్రమాణాలను పర్యవేక్షించి మెరుగు పరచడం, ఉపాధ్యాయులకు ఉత్తమ బోధనా పద్ధతులను తెలియజేయడం లాంటివాటిపై సలహాలు ఇవ్వడం వంటి వాటిని పర్యవేక్షిస్తారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం డీవీఎల్.నరసింహారావు తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగంలో బాలబాలికలు ఎంపికైనట్లు పీఈటీలు శ్రీనివాసరావు, రవికుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్కూలులో ఎంపికైన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

23 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

సింగరాయకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ బాల, బాలికల పోటీలు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకూ సింగరాయకొండలో నిర్వహించనున్నారు. అందుకోసం స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ జూనియర్ కళాశాల మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను ఒంగోలు డీఐఈవో కె.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య, పీడీ శంకర్‌రావు శుక్రవారం పరిశీలించారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్‌రావుకు డీఐఈవో సూచించారు.

భక్తిశ్రద్ధలతో.. పోలి పాడ్యమి

- నీటిలో దీపాలు వదిలి మహిళల పూజలు

పోలి పాడ్యమి వేడుకలను శుక్రవారం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్నానాలు ఆచరించి పూజలు చేశారు. కొత్త దుస్తులు ధరించి కార్తీక దీపాలను తమ ఇళ్లముందు, దేవాలయాలలో వెలిగించారు. ఎక్కడికక్కడ మహిళలు దీపాలను అరటి దొప్పల్లో పెట్టి నీళ్లలో వదిలారు.

- ఒంగోలు కల్చరల్, (ఆంధ్రజ్యోతి)



దశరాజుపల్లిరోడ్డులోని అప్పాయికుంటలో...



కొప్పోలు చెరువు వద్ద



కొప్పోలు చెరువులో దీపాలను వదులుతూ..




మద్రిపూడి- రేగలగడ్డ మధ్య అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు


దెబ్బతిన్న చీర్వానుప్పలపాడు-అమ్మనబ్రోలు రోడ్డు


అధ్వానంగా నాగులుప్పలపాడు-మాచవరం రోడ్డు

గతుకు.. బితుకు!

అధ్వానంగా రహదారులు ● పలుచోట్ల పెద్దపెద్ద గోతులు

కొన్ని ప్రాంతాల్లో ప్రమాద భరితం ● వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు


గుంతలమయంగా ఈదుమూడి-దుద్దుకూరు రోడ్డు


కామేపల్లిలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత


కనపర్తి-చిన్నంగారిపట్టపుపాలెం రోడ్డులో పడిన గొయ్యి


నాగులుప్పలపాడు-ఉప్పుగుండూరు మధ్య బీటలు వారిన జాతీయ రహదారి

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలోని పలు ప్రధానమైన రహదారులు గోతులమయంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తట్టి మట్టి కూడా వేయకపోవడంతో ఇప్పుడు అవి మరింత దారుణంగా తయారయ్యాయి. కొన్నిచోట్ల ప్రమాదభరితంగా ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని రహదారులకు మరమ్మతులు చేయించినప్పటికీ మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మళ్లీ యథాస్థితికి చేరాయి. నియోజకవర్గంలో ప్రధానమైన టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు దాదాపు 67 కిలో మీటర్లు ఉంటుంది. ఈరోడ్డులో 40 గ్రామాల వరకు ఉన్నాయి. అధికశాతం రోడ్డు బాగున్నప్పటికీ పలు గ్రామాల మధ్య గోతులమయంగా మారింది. మద్రిపూడి గ్రామం ప్రారంభానికి దక్షిణం వైపున ఉన్న ఓ ప్రైవేటు స్కూల్ నుంచి రేగలగడ్డ వరకు దాదాపు 3 కిలో మీటర్ల దూరం రోడ్డుపై అడుగుకో గుంత దర్శనమిస్తోంది. దీంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. కొండపి మండలంలోని పెట్లూరు సహజానంద స్వామి ఆలయం వద్ద దాదాపు రెండొందల మీటర్లు, పెట్లూరు చెరువుకట్ట దిగువ భాగంలో ఉన్న రోడ్డు దాదాపు కిలో మీటరు, గ్రామానికి తూర్పువైపున మరో కిలోమీటరు దూరం మరీ దారుణంగా మారింది. భారీ, చిన్న వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. పెట్లూరు-తాటాకులపాలెం గ్రామాల మధ్య పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. కొండపి-పెరిదేపి, చోడవరం-చెన్నూరు, పాలేటిపాడు-తూమాడు, పాలేటిపాడు-జయవరం గ్రామాల మధ్యన కూడా ఇదే దుస్థితి కనిపిస్తోంది.

కొండపి-కామేపల్లి-జరుగుమల్లి రోడ్డులో...

కొండపి నుంచి కామేపల్లి మీదుగా జరుగుమల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కట్టావారిపాలెం-ఇలవర గ్రామాల మధ్య దెబ్బతింది. గోతులమయంగా మారింది. ఇలవర ఎస్సీ కాలనీ నుంచి గ్రామం వరకు, ఇలవర నుంచి కామేపల్లి వరకు కూడా ప్రమాదభరితంగా ఉంది. గురవాయికుంట నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కామేపల్లి- చతుకుపాడు గ్రామాల మధ్యన అగ్రహారం వద్ద నర్సింగోలు, దావగూడూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల వద్ద తారులేచిపోయి గోతులు ఏర్పడ్డాయి.

కామేపల్లి నుంచి పొన్నలూరు రోడ్డులో..

కామేపల్లి నుంచి రావులకొల్లు మీదుగా పొన్నలూరు వరకు ప్రధానమైన రోడ్డులో అక్కడక్కడా గోతులు ఏర్పడ్డాయి. కామేపల్లిలో ప్రముఖమైన పోలేరమ్మ ఆలయ ఉండటంతో అక్కడికి కందుకూరు, పొన్నలూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు ఇదే రోడ్డు నుంచి వాహనాల్లో వస్తుంటారు. కామేపల్లి నుంచి రావులకొల్లు వరకు.. అక్కడి నుంచి ఉప్పలదిన్నె అడ్డరోడ్డు వరకు దాదాపు కిలో మీటరు రోడ్డులో గోతులు ఏర్పడ్డాయి. ఉప్పలదిన్నె అడ్డరోడ్డు నుంచి పొన్నలూరు వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. పొన్నలూరుకు సమీపంలో చప్టాపై గొయ్యి ఏర్పడటంతో అందులో పెద్ద కట్టెను గొయ్యి కనిపించేలా వాహనదారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో నియోజకవర్గంలోని అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. కొన్నిచోట్ల తారులేచిపోయి రాకపోలకు ఇబ్బందికరంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమైంది. ప్రభుత్వం రోడ్లుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడు మండల పరిధిలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెబ్బతిన్న రోడ్లపై ద్విచక్రవాహన ప్రమాదాలు చోటుచేసుకొని గాయాలపాలవు తున్నారు.

- ఉప్పుగుండూరు నుంచి ఈదుమూడి వరకు ఉన్న 8 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ తారురోడ్డు లేచిపోయి, గుంతలు పడి మట్టిగుంట వరకు మరీ అధ్వానంగా మారింది. అక్కడ తరచూ ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి.

- నిత్యం ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు రెండు ఆర్టీసీ బస్సులు ప్రయాణించే ఈదుమూడి నుంచి దుద్దుకూరు వరకు గల 3.5 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ గ్రావెల్ రోడ్డు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక రాళ్లు తేలి గుంతలు మయంగా మారింది. సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలో 2.30 కిలోమీటర్లు, పర్చూరు నియోజకవర్గం పరిధిలో 1.20 కిలోమీటర్ల సదరు రోడ్డు ఉండటంతో అభివృద్ధికి నోచుకోక అనాది నుంచి గ్రావెల్ రోడ్డుగానే మిగిలింది.


పొన్నలూరు- రావులకొల్లు రోడ్డులో చప్టాపై ఏర్పడిన గుంత

- ఈదుమూడి గ్రామం నుంచి ఎం.ముప్పాళ్ల వెళ్లే రోడ్డు మొంథా తుఫాన్ ధాటికి ఈదుమూడి సమీపంలో సగం రోడ్డు కోసుకుపోయి పలుచోట్ల దెబ్బతింది.

- తీరప్రాంత గ్రామం కనపర్తి నుంచి చిన్నంగారి పట్టపుపాలెం, కుక్కలవారిపాలెం వెళ్లే పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 4 కిలోమీటర్ల బీటీరోడ్డు అక్కడ క్కడా ప్యాచ్‌లుగా దెబ్బతింది. పలు చోట్ల గుంతలు పడ్డాయి.

- కనపర్తి సమీపంలోని బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న మట్టిరోడ్డుతో కూడిన రోడ్డుకు సమాంతరంగా ఉన్న రోడ్డువంతెన మొంథా తుఫాన్ సమయంలో కింది భాగంలో మట్టికోసుకుపోయింది. దీంతో వంతెనపై భాగంలో రంధ్రం పడింది. నిత్యం అటుగా వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు భయంతో ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

- చీర్వానుప్పలపాడు-అమ్మనబ్రోలు గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ శాఖకు పరిధిలోని తారు రోడ్డు సైతం దెబ్బతింది. తారులేచిపోయి, గుంతలుపడి వర్షాకాలంలో నీళ్ల నిలుస్తూ వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- ఉప్పుగుండూరు నుంచి త్రోవగుంట వరకు 22 కిలోమీటర్ల సిమెంట్‌రోడ్డు జాతీయ రహదారి-216 పలు చోట్ల బీటలు వారింది. రోడ్డుకు అడ్డదిడ్డంగా విరిగిపోతూ దర్శనమిస్తుంది. మరమ్మతులు చేపట్టినా మళ్లీ యథాస్థితి నెలకొంది. నాగులుప్పలపాడు-ఉప్పుగుండూరు గ్రామాల మధ్య పలు చోట్ల రహదారి రెండుగా చీలిపోయి ద్విచక్ర వాహనదారులు భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్లోబల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ముప్పవరం గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ కొండపి ఇన్‌చార్జి ఏడీ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పశువులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. గ్రామాల్లోని పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

ఒంగోలు క్రైం,నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహన చోదన చేసిన 33 మందికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో మద్యం తాగి వాహన చోదన చేసిన 33 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కార్మికులను అవమానించడం తగదు

ఒంగోలు కలెక్టరేట్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పని చేయకుండా కార్మికులకు జీతాలు ఇవ్వాలా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించడం కార్మికులను అవమానించడమేనని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. విశాఖ ఉక్కు కార్మికులపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. శుక్రవారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులు పనిచేయకుంటే 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి నుంచి 7.3 మిలియన్ టన్నులకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వాలకు రూ.60వేల కోట్ల పన్నులు, డివిడెంట్ రూపంలో చెల్లించిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నష్టాలపాలు అయ్యేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ఆరోపించారు. సమావేశంలో జీవీ.కొండారెడ్డి, రఫీ, టి.రంగారావు, బి.సుబ్బారావు, టి.మహేష్, పి.కల్పన, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, కేశవరావు, టి.ఆవులయ్య, అంజనేయులు, సీహెచ్.చిరంజీవి, మాలకొండయ్య పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య దినోత్సవం

ఒంగోలు విద్య, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమణి హాజరయ్యారు. ఆక్వాకల్చర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.సుధాకర్, అశ్వత్ నారాయణ, బి.సురేష్, వెంకటేశ్వరరెడ్డి, భారతీదేవి పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోజు ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 9గంటలకు రిమ్స్ వైద్యశాలలో శ్రీసత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక గృహ నిర్మాణశాఖ కార్యాలయంవద్ద గనులశాఖ నూతన కార్యాలయ భవన శంకుస్థాపనలో పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఎంపీ హాజరవుతారు.

పొగాకు కొనుగోళ్లు 10 రోజుల్లో పూర్తి

● ఆర్‌ఎం రామారావు

మద్దిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లు మరో 10 రోజుల్లో పూర్తిచేస్తామని బోర్డు ఆర్‌ఎం రామారావు తెలిపారు. శుక్రవారం వెల్లంపల్లి పొగాకే వేలంకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది 160 మిలియన్లు పొగాకు రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తి లక్ష్యం కాగా 220 మిలియన్లు రావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ధరల విషయంలో ఎప్పటికప్పుడు వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. రైతులు జాగ్రత్తలు తీసుకొని మేలిమిరకం నారు నాటాలని సూచించారు. పొగాకు అమ్మకాలు సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డ్వామా పీడీ


పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ నుంచి జాతీయ అవార్డును అందుకుంటున్న పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజను డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మర్యాదపూర్వ కంగా కలిశారు. శుక్రవారం అమరావతిలో కమిషనర్‌ను కలిసి వాటర్‌షెడ్ పథకంలో జాతీయ స్థాయిలో జిల్లాకు రెండవ స్థానం రావడంతో కేంద్ర ప్రభుత్వం అందించిన మెమోంటో, ప్రశంసా పత్రంను కృష్ణతేజ చేతుల మీదుగా పీడీ జోసఫ్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పీసీపల్లి మండలం మురుగమ్మి పంచాయతీ జాతీయ స్థాయిలో రెండో స్థానం పొంది అవార్డును పొందడం పట్ల కమిషనర్ కృష్ణతేజ డ్వామా పీడీని ప్రత్యేకంగా అభినందించారు.

ఓటుహక్కుపై అవగాహన


ఎన్నికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించడం అందరి బాధ్యతని హెచ్‌ఎం మండవ ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం గుండ్లాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు అందరూ తమ ఓటుహక్కును ఉపయోగించుకున్నారు. విద్యార్థులే పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. అనంతరం వారు కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించారు. పాఠశాలకు సంబంధించి మొత్తం 15 మంది విద్యార్థులను ఎన్నుకోగా వీరితో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

మద్దిపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీఎల్‌వోలు అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం మద్దిపాడులో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. అందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రంకురోడ్డు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం

● మంత్రి స్వామి చొరవ

సింగరాయకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ ప్రధాన రహదారి అయిన ట్రంకురోడ్డు గుంతలమయంగా మారింది. మొంథా తుఫాన్, అంతకు ముందు కురిసిన భారీ వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. గుంతల్లో గులకరాళ్ల పైకిలేవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. డివైడర్‌కు ఇరువైపులా ఉన్న మార్జిన్లు దెబ్బతిన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరమ్మతులు చేపట్టినప్పటికీ ఇటీవల తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలకు రోడ్డు యథాస్థితికి వచ్చింది. ఛిద్రమైన ట్రంకురోడ్డు నిర్మాణానికి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రూ.3కోట్లు మంజూరు చేయించారు. త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి. కొన్ని నెలల్లో వాహనదారుల అవస్థలు తీరనున్నాయి. మండలంలోని శానంపూడి రోడ్డు, ఊళ్లపాలెం-పాకల రోడ్డుపై ఇటీవల వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నాసా కిట్లు


నాసా కిట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జోసఫ్

ఒంగోలు(రూరల్), నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రిన్స్‌పాల్ జోసఫ్‌తంబి నాసా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీన్ బాలసుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ అనిల్, నాసా ప్రోగ్రామ్ ఇన్‌చార్జి మధుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులను త్వరగా పంపిణీ చేయాలి

ఒంగోలు(రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలో పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ రేషన్‌కార్డులను రెండు రోజుల్లో లబ్ధిదారులకు అందజేయాలని తహసీల్దార్ మధుసూదనరావు ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లుతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 10వేల మందికి ఇంకా స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేయాల్సి ఉందన్నారు. సోమవారం మిగిలి ఉన్న రేషన్‌కార్డులు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆయన చెప్పారు. నగర పరిధిలో 56వేల రేషన్‌కార్డులు ఉంగా అందుల్లో 46వేల మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన కార్డులను విచారణ చేసి వాటిని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ బి.రామానాయుడు, ఎఫ్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ నిషేధం ఎత్తివేతను ఉపసంహరించుకోవాలి

సంతనూతలపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ నిషేధం ఎత్తివేతను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సంతనూతలపాడులోని సుందరయ్యభవన్‌లో శుక్రవారం జరిగిన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు, బలహీనవర్గాల పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్నటువంటి 9/77 అసైన్డ్ చట్టాన్ని రాష్ట్ర మంత్రివర్గం సవరణ చేసి అమ్మకాలు, కొనుగోలుపై ఉన్న ఫ్రీహోల్డ్ నిషేధాన్ని ఎత్తివేయడం సరైన నిర్ణయం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 33లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేయగా అందులో 13లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంతోనే అభివృద్ధి : ఐద్వా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సమాన హక్కులు, సాధికారికత కల్పించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి పేర్కొన్నారు. ఒంగోలులోని ఐద్వా కార్యాలయంలో గురువారం ముఖ్యకార్యకర్తల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే సమాజంలోని మానవ శక్తినంతా వినియోగంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఐద్వా ప్రతినిధులు జి.ఆదిలక్ష్మి, కె.లక్ష్మీప్రసన్న, ఎస్‌కే.నాగూర్‌బీ, కె.రాజేశ్వరి, బంకా పద్మ, బి.రాజ్యలక్ష్మి, కె.ధనలక్ష్మి, పి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

మంత్రి దోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ● మల్లవరప్పాడులోని పడమర చెరువులో చేప పిల్లలు విడుదల


చెరువులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి స్వామి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నాయకులు

మల్లవరప్పాడు (కొండపి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం, మల్లవరప్పాడు గ్రామంలోని పడమర చెరువులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువుల్లో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం 7లక్షల చేపపిల్లలు వదులుతున్నామన్నారు. దీనివల్ల గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు మత్స్యకారుల జీవనోపాధి లభిస్తుందన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల భృతిని ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పాటుపడాలి

● ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పారిశుధ్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. పి.గుడిపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శుక్రవారం క్లాప్‌మిత్రలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం వీధులను శుభ్రం చేశారు. క్లాప్‌మిత్రకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మల్లవరపు రామక్రిష్ణారెడ్డి, ఈవోఆర్డీ అరుణకుమారి పాల్గొన్నారు.


సర్టిఫికెట్లను అందిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు, హరిబాబు


అన్నంగిలో పారిశుధ్య సిబ్బందితో ఎంపీడీవో జ్యోతి

అన్నంగిలో..

మద్దిపాడు): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం అన్నంగిలో గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త సింగరబొట్లపాలెంలో..

పొన్నలూరు: కొత్త సింగరబొట్లపాలెం గ్రామంలో శుక్రవారం థీమ్-5పై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ మండలంలో ఒక పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం గ్రామంలో చెత్తకుప్పలను తొలగింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, డిప్యూటీ ఎంపీడీవో సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రామ నాయకులు జి.రమణారెడ్డి, కె.రాఘవరెడ్డి, ధనకోటిరెడ్డి, సీహెచ్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఒంగోలు(రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చేజర్ల, బొద్దులూరివారిపాలెం ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసిన వరి నారుమళ్లు తుఫాన్ దెబ్బకు పూర్తిగా మట్టిపాలు అయ్యాయని, దీంతో వారు పెట్టుబడులు నష్టపోయారని, అధికారులు వారికి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని రైతులు రైతు సేవా కేంద్రాలలో తమ పేర్లు తిరిగి నమోదు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మండవవారిపాలెంలో త్రీఫేస్ విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని చెరువు దగ్గర ఫిల్టర్‌బెడ్‌ల కోసం నిధులు కేటాయించాలని కోరారు. రైతులకు డీఏపీ ఎరువును అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు సమస్యలుపై ఎంపీటీసీలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్, పరిపాలనాధికారి శేషుబాబు, ఏఈ రామ్‌కుమార్, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

ఒంగోలు (రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజున పోలిపాడ్యమిని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు చెరువులో మహిళలు పెద్ద ఎత్తున చేరి అరటిదొప్పలలో దీపాలు వెలిగించి చెరువులోకి వదిలారు. ముందుగా చెరువు కట్టపై కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుష్ఠు సర్వే పరిశీలన

సింగరాయకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో టి.వాణిశ్రీ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీధర్, ఆరోగ్య విస్తరణ అధికారి మోహన్‌రావు, ఆరోగ్యపర్యవేక్షకులు మసూద్‌అలీ పాల్గొన్నారు.

నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలి

టంగుటూరు (కొండపి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు నాణ్యమైన నారును ఎంపిక చేసుకోవాలని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం టంగుటూరు మండలం గొర్లమిట్ట, మట్టిపాడు, ఆలకూరపాడు, జమ్ములపాలెం, జరుగుమల్లి మండలం చిర్రికూరపాడులోని నారుమడులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.



బిరుదులనరవ ఎస్సీ కాలనీలో
నీటికోసం ఖాళీ బిందెలు చూపిస్తున్న ప్రజలు

తాగునీరివ్వాలని ఖాళీ బిందెలతో నిరసన

మార్కాపురం రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బిరుదుల నరవ గ్రామ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఖాళీ బిందెలు, డ్రమ్ములతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా ఎస్సీ కాలనీలో ఉన్న బోరు పనిచేయక పోవడంతో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అప్పటి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారన్నారు. నాలుగు రోజుల నుంచి అధికారులు ట్యాంకర్‌లను నిలిపి వేయడంతో సమస్య తీవ్రమైందని తెలిపారు. దూర ప్రాంతం నుంచి నీటిని బిందెలతో తీసుకొచ్చుకోవాలంటే ఇబ్బంది కరంగా ఉందని అన్నారు. వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు నీరు దూర ప్రాంతం నుంచి నీటిని తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నామన్నారు. సమస్యను గుర్తించిన అధికారులు వెంటనే ట్యాంకర్‌ను ఏర్పాటు చేయించాలని ఎస్సీ కాలనీ ప్రజలు తెలిపారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రూ.80 లక్షలతో చెక్ డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు

బేస్తవారపేట,నవంబరు21(ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట మండలంలోని పూసలపాడు గ్రామ పంచాయతీలో భూగర్భ జలాల పెంపు కోసం నల్లవాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం కోసం నామ్ ఫౌండేషన్ ద్వారా రూ.80 లక్షల వ్యయంతో ప్రతిపాదన చేశామని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాజభావుషెల్కె గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నల్లవాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం,అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు,అమలు విధానం, కావలసిన సాంకేతిక సహకారం వంటి అంశాలపై చర్చించారు.ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు నామ్ ఫౌండేషన్ అధ్యక్షుడు నానా పటేకర్ సహకారం ఉంటుందని ఎమ్మెల్యేకు వివరించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

జడ్పీ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈవో తనిఖీలు

తర్లుపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్కాపురం డివిజన్ విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యాభ్యాసం గురించి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గ్రంథాలయంలోని వివేకానంద పఠనాలయంను పరిశీలించి వాటి వినియోగం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. భౌతిక రసాయన శాస్త్రం, జీవన శాస్త్రం ప్రయోగశాలలోని వసతులను పరిశీలించారు. పూర్వ విద్యార్థులతో పాఠశాలలో చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పింఛన్ ఇప్పించండి సార్

● ఎరిక్షన్‌బాబుకు విన్నవించుకున్న కుటుంబం

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నడుపుతూ కింద పడి వెన్నుమొక (నడుము) విరిగి తన భర్త మంచానికే పరిమితమయ్యాడని, దీంతో కుటుంబ పోషణ భారమైందని మండలంలోని కాశికుంట తాండాకు చెందిన పాత్లవత్ లక్ష్మానాయక్ భార్య టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు ముందు కన్నీటిపర్యంతమైంది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ ముగించుకుని బయటికి వస్తున్న సమయంలో ఆటోలో భర్తను తీసుకొచ్చింది. పక్కనే ఉన్న కాశికుంట తాండ సర్పంచ్ ఎంసీహెచ్ మంత్రునాయక్ వారి సమస్యను తెలిపారు. ఎరిక్షన్ బాబు వారితో మాట్లాడి సమస్యను నేరుగా తెలుసుకున్నాడు. 6 సంవత్సరాల క్రితం ట్రాక్టర్‌పై నుంచి కింద పడి వెన్నెమొక విరిగి మంచానికే పరిమితమయ్యాడని ఆరుగురు సంతానంతో కుటుంబం గడవడం కష్టంగా ఉందని భార్య హనిమి భాయ్ తెలిపింది. ప్రభుత్వం తరుపున సాయం చేయాలని కోరింది. దీనితో ఎరిక్షన్ బాబు ప్రభుత్వం అందించే రూ.15వేలు పింఛన్, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రహదారి ఆక్రమణలను తొలగిస్తాం

కంభం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుశీల తెలిపారు. శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్, వై జంక్షన్, రావిపాడుకు వెళ్లే రహదారిని, ఆయా ప్రాంతాలలో జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్ పాత్, డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను, అక్రమ కట్టడాలను పరిశీలించారు. త్వరలో రోడ్డుకు ఇరువైపులా కొలతలు వేయించి ఆక్రమణలు తొలగించడంతో పాటు భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.



కంభం జాతీయ రహదారిపై ఆక్రమణలను పరిశీలిస్తున్న డీటీసీ సుశీల, అధికారులు

హైవే ఆక్రమణదారులపై చర్యలు

బేస్తవారపేట :అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని బేస్తవారపేటలో గత కొన్ని రోజులుగా ట్రాఫిక్ రద్దీతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పి.సుశీల బేస్తవారపేటలోని రోడ్లను పరిశీలించారు. రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో పాటు తోపుడు బండ్లు ఏర్పాటు చేసి ఉండటాన్ని ఆమె గుర్తించారు. రోడ్డును ఆక్రమించి ఎవరైతే వ్యాపారులు, షాపులు,తోపుడు బండ్లు నిలిపి రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారో ఆషాపు నిర్వాహకులను పిలిచి హెచ్చరించారు.వెంటనే వాటిని తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

అధ్వానం.. గుంతలమయం

తుఫాన్‌తో మరింతగా దెబ్బతిన్న రహదారులు

ప్రజలు, వాహనచోదకుల అవస్థలు

గిద్దలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కనీసం రోడ్ల మధ్య ఉన్న గుంతలను కూడా పూడ్చలేని దుస్థితి నెలకొన్నది. తాత్కాలిక మరమ్మతులు చేసినా వారం పదిరోజులకు మళ్లీ గుంతలు అలాగే వెలుస్తున్నాయి. కడప నుంచి విజయవాడకు వెళ్లే ప్రధాన రాష్ట్రీయ రహదారిలో చాలా భాగం గుంతలమయంగా తయారైంది. ప్రకాశం, కడప జిల్లాల సరిహద్దుల్లో కొమరోలు మండలం ప్రారంభం కాగానే రోడ్డు మధ్యలో పెద్ద గుంత దర్శనమిస్తున్నది. అలాగే ఇదే రోడ్డులో పాముూరుపల్లి శివాలయం వద్ద రోడ్డు గుంతలమయమై కంకర తేలింది. గోనపల్లె, మదవ వద్ద కూడా ఇదే పరిస్థితి. కొమరోలు, అల్లీనగరం గ్రామాల మధ్య కడప రహదారిపై సిమెంటు రోడ్డు వేసినప్పటికీ వాహనాల తాకిడికి గుంతలమయమైంది. ఇదే మండలంలో సూరేవారిపల్లి రోడ్డు కూడా అధ్వానంగా ఉండగా యర్రగుంట్ల నుంచి అల్లీనగరం వరకు అడుగడుగుకూ గుంతలు కనిపిస్తున్నాయి. బేస్తవారపేట మండలంలోని చిన్న కంభం నుంచి బేస్తవారపేట వచ్చే రోడ్డు కూడా కంకర తేలి గుంతలమయమైంది. బేస్తవారపేట నుంచి చాలా గ్రామాలను కలుపుతూ వెళ్ళే కోనపల్లి రోడ్డు కూడా దుస్థితికి చేరింది. కంభం చెరువుకట్టకు వెళ్లే రోడ్డులో చప్టా వద్ద రోడ్డంతా కోతకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గిద్దలూరు మండలంలోని గిద్దలూరు-కొమరోలు రోడ్డులో గిద్దలూరు నుంచి నరవ వరకు రోడ్డంతా గుంతలమయమై అధ్వానంగా తయారైంది. జి.కొత్తపల్లి వద్ద రోడ్డు మార్జిన్లు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది.



బేస్తవారపేట మండలం అక్కపల్లి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



చిన్నదోర్నాల వద్ద మార్కాపురం వెళ్లే ప్రధానరోడ్డులో కుంగిన చప్టా

ఆ రహదారులపై ప్రయాణం నరక ప్రాయమే..

మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గంలోని పలు రహదారులు ఛిద్రమై రాకపోకలు సాగించే వాహనదారులకు పగలే చుక్కలు కనబడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు ఓ మోస్తర్తుగా ఉన్నా మొంథా తుఫాన్ ప్రభావంతో చాలా చోట్ల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. మార్కాపురం నుంచి తర్లుపాడుకు ప్రస్తుతం సింగిల్ లైన్ బీటీ రోడ్డు ఉంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎక్కడికక్కడ రోడ్డు గుంతలమయంగా మారిం ది. క్రమం తప్పకుండా మరమ్మతులు చేపడుతున్నా వర్షాకాలం వచ్చిందంటే రహదారి రూపురేఖలు మారిపోతున్నాయి. ఎక్కడికక్కడ అడుగుల మేర నీరు నిలుస్తుండటంతో వాహదారులు బెంబేలెత్తుతున్నారు.



గోతులతో దర్శనమిస్తోన్న తర్లుపాడు రోడ్డు

ఆ రోడ్డుపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే..

కొనకనమిట్ల మండలంలోని వాగుమడుగు నుంచి గనివినపాడుకు 4 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. రహదారి మొత్తం పూర్తిగా దెబ్బతినింది. బీటీ లేయర్ మొత్తం ఎక్కడికక్కడ లేచి పోవడంతో వర్షం నీటిలో గుంతలు ఎక్కడ ఉన్నాయో, రహదారి ఎక్కడ ఉందో అర్థంకాక చాలా మంది ప్రమాదానికి గురయ్యారు. ఈ రహదారికి గతంలో మరమ్మతులు చేసిన దాఖలాలు కూడా లేవు.

రోడ్లను దెబ్బతీసిన వర్షాలు

● కుంగిన చప్టాలు

త్రిపురాంతకం : మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు అసలే అధ్వానంగా ఉన్న రోడ్లకు అధికంగా కురిసిన వర్షాల కారణంగా మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కొన్ని రోడ్లకు ఇటీవల మరమ్మతులు చేయగా అవి కూడా ఎప్పటిలాగానే మారాయి. ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. అడుగుకో గుంత అదికూడా మోకాలిలోతు గుంతలతో వర్షాల సమయంలో ఎలా వెళ్లాలో కూడా తెలియని పరిస్థితి. ఎర్రగొండపాలెం-పుల్లలచెరువు మధ్యలో ప్రధాన రోడ్డులో ఉన్న చాపలమడుగు వద్ద చప్టా కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. వర్షాల సమయంలో ఉధృతంగా వచ్చిన వరద ధాటికి కింద బాగం పునాది కదిలి చప్టా కుంగిపోయింది. ఇక దోర్నాల - మార్కాపురం మధ్య చిన్నదోర్నాల వద్ద చప్టా పరిస్థితి కూడా అంతే. ఇటీవల తుఫాను సమయంలో వచ్చిన వరద నీటికి చప్టా కుంగిపోయింది. దోర్నాల-కర్నూలు ప్రధాన రహదారిలో కూడా కొత్తూరు వద్ద దొంగలవాగుపై ఉన్న చప్టా ప్రమాదకరంగా ఉంది. తుపానుతో పాటు ఇటీవల కురిసే వర్షాలకు నల్లమల నుంచి అధికంగా వస్తున్న వాగు ఉధృతికి చప్టా చాలాభాగం దెబ్బతినింది. నిత్యం రద్దీగా ఉండే కర్నూలు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ఈ చప్టాను తక్షణమే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. త్రిపురాంతకం మండంలోని వెల్లంపల్లి వద్ద గుండ్లకమ్మ పై నిర్మించిన వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేకపోవటంతో వంతెన నిర్మించినప్పటికీ ఇబ్బందులు తప్పటం లేదు. పుల్లలచెరువు-ముటుకుల రోడ్డును ఇటీవలే మరమ్మతులు పేరుతో నిర్మించినప్పటికీ ఏడాది తిరక్కుండానే మళ్లీ యథాస్థితికి వచ్చింది. రోడ్లపై దృష్టి సారించి త్వరితగతిన మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల ఆరోగ్య భద్రతకు సహకరిస్తాం

రాచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు సహకరిస్తామని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఈవో ఎస్ వెంకట రామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన పారిశుధ్య కార్మికుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాలీచాలని జీతాలతో కార్మికులు గ్రామాల పరిశుభ్రత కోసం కృషిచేస్తున్నారని, వారికి అనారోగ్య సమస్యలు లేదా ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే ఆదుకునే విధంగా వారి హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమాకు సంబంధించి తాము ఇన్సూరెన్స్ చేయించేందుకు కృషిచేస్తామన్నారు. మండలంలో 40మంది వరకు కార్మికులు ఉన్నారని, వారందరికీ తెలుగుదేశం పార్టీ తరపున ఇన్సూరెన్స్ చేయించేందుకు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఐ. వెంకటేష్, టీడీపీ నాయకులు జి. జీవనేశ్వర్ రెడ్డి, డి. కాశిరెడ్డి, పి. సనావుల్లా ఖాన్, పి. శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కలిసి పనిచేద్దాం

గ్రామాల పరిశుభ్రతకు కలిసి పనిచేద్దామని ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని కల్వపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లపై చెత్తను తొలగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న యోగానంద్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మార్కాపురం రూరల్ : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో బాలచెన్నయ్య తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఎంపీడీఓ బాలచెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధులలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పనిచేసే క్లాప్ మిత్రలకు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ నిర్వహించారు.

గ్రామాల పరిశుభ్రతే ప్రభుత్వ ధ్యేయం

కొమరోలు : గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో సత్యం అన్నారు. మండలంలోని గోపానిపల్లి గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. మురుగు కాలువలను, పిచ్చిచెట్లను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారి దేవరశెట్టి బ్రహ్మయ్య, జనార్ధనరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో కార్మికులతో కలసి ర్యాలీలో ఎంపీడీవో రాజ్‌కుమార్

థీమ్ 5పై శిక్షణ శిబిరం

గిద్దలూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో థీమ్-5 కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. వీధులను శుభ్రం చేయుట, పారిశుధ్యం గురించి ఇంటింటికీ వెళ్లి అవగాహన వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎంపీడీవో సీతారామయ్య ఈసందర్భంగా సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు.

తర్లుపాడులో..

తర్లుపాడు : మండలంలోని మీర్జపేటలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో బొర్ర చంద్రశేఖర్, ఈవోఆర్డీ రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి కాలంగి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై కార్మికులకు శిక్షణ

త్రిపురాంతకం : పరిశుభ్రతపై థీమ్-5లో భాగంగా శుక్రవారం పారిశుధ్య కార్మికులకు శిక్షణ నిర్వహించారు. మేడపి గ్రామంలో డీడీవో బాలునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరిచారు. క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మురళి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు పూజలు శుక్రవారం మార్కాపురం పట్టణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలోని చివరిరోజు పోలిపాడ్యమి పురస్కరించుకుని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు అంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవ స్వామి కోనేరు వద్ద గల వేణుగోపాలస్వామి ఆలయంలో జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేంచేపు చేశారు. పూజ కార్యక్రమాల అనంతరం మహిళలు కొనేటిలో అరటిదొప్పలపై కార్తీక దీపాలను ఉంచి కొనేటిలో వదిలారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశువుల రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలు పర్యవేక్షించారు.



కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



చిన్నకంభంలో
కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రసన్నరామాలయంలో..

మార్కాపురం : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అమావాస్య తర్వాత నిర్వహించే పోలి స్వర్గం కార్యక్రమాన్ని స్థానిక ప్రసన్న రామాలయం వద్ద శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తుల ఆధ్వర్యంలో దీపాలంకరణ సేవ కన్నుల పండువగా జరిగింది.

ముగిసిన కార్తీక పూజలు

కంభం : నెల రోజులుగా శివాలయాలలో నిత్యం జరుగుతున్న కార్తీక మాస ప్రత్యేక పూజలు శుక్రవారంతో ముగిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు వెళ్లి పరమేశ్వరుని దర్శించుకున్నారు. అనంతరం కార్తీక దీపం వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. కంభం , అర్థవీడు మండలాలలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

నూతన భవనాలు త్వరలో ప్రారంభిస్తాం

రాచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి అన్నారు. వైసీపీ హయాంలో సుమారు రూ.72లక్షలు వెచ్చించి చేపట్టిన ఉపాధి హామీ మండల సమాఖ్య, ఆరోగ్య క్లినిక్, రైతు సేవా కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయకుండానే అసంపూర్తిగా వదిలి వేయడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. శుక్రవారం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి వాటిని పరిశీలించి, వాటి నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం యంత్రాల సహాయంతో భవనాల చుట్టూ ఉన్న కంపచెట్లను స్థానిక పార్టీ నాయకులు తొలగించారు.

మార్కాపురం జిల్లా సాధన కోసం పోరాటం

ఎర్రగొండపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లా సాధన కోసం పోరాటం చేద్దామని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ షేక్ సైదా అన్నారు. ఎర్రగొండపాలెంలో శుక్రవారం మార్కాపురం జిల్లా సాధనకమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు,

ప్రజాదర్బార్‌లో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం

● టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో తీసుకునే ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతులను పరిశీలించి అధికారులకు ఫోన్లు చేసి సమస్యలు పరిష్కారించాలని సూచించారు. ప్రజాదర్బార్‌లో ఎక్కువగా భూసమస్యలు, వృద్ధాప్య పింఛన్ల కోసం అర్జీలు అందజేశారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను సంబధిత అధికారులకు పంపించారు. ఎన్నికల హామీగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం ముఖ్యమంత్రితో మాట్లాడి మార్కాపురంను త్వరగా జిల్లాగా ప్రకటన చేయించాలని మార్కాపురం జిల్లా సాధన కమిటీ కన్వీనర్లు షేక్ సైదా, మెడబలిమి వెంకటేశ్వర్లు, అందే నాసరయ్యా వామపక్షాల నేతలు టీడీపీ ప్రజాదర్బార్‌లో టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబును కలసి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురంను జిల్లాగా ప్రకటించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులతో కమిటీని నియమించారని ఎరిక్షన్ బాబు వారికి చెప్పారు. మార్కాపురం జిల్లా, వెలిగొండప్రాజెక్టు పూర్తి రెండు వాగ్దానాలు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ప్రజా దర్బార్‌లో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, షేక్ మాబు, మేకల వళరాజు పాల్గొన్నారు.



పశువుల యజమానులకు చెక్కులు అందజేస్తున్న సబ్ డీఎఫ్‌వో నీరజ్ హన్స్

పశువుల యజమానులకు పరిహారం

పెద్ద దోర్నాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు నష్ట పరిహారం చెక్కులను స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సబ్ డీఎఫ్‌వో నీరజ్ హన్స్ శుక్రవారం అందజేశారు. నల్లమల అటవీ ప్రాంతం సమీప గూడేలకు చెందిన చెంచు గిరిజనుల పశువులు అడవిలో మేతకు వెళ్లిన సమయంలో పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఈ నేపథ్యంలో బాధిత గిరిజనులకు ఆర్థిక తోడ్పాటు నిచ్చేందుకు అటవీశాఖ నష్ట పరిహారం మంజూరు చేసింది. మండలంలోని మర్రిపాలెంకు చెందిన కుడుముల హనుమయ్యకు రూ.15వేలు, భూమని పోలయ్యకు రూ.15వేలు, చింతలకు చెందిన ఆర్తి అంకమ్మకు రూ.25వేలు చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల రేంజ్ అధికారి హరి, డీఆర్‌వోలు చెన్నయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ లైన్‌మన్ మృతి

కొమరోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిచెర్ల విద్యుత్ శాఖ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. బికోజి నాయక్ (42) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం పుల్లల చెరువు కాగా తాటిచర్ల విద్యుత్ లైన్‌మన్‌గా గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ లైన్‌మన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కొమరోలు విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది సంతాపాన్ని తెలియజేశారు.



బికోజి నాయక్ (ఫైల్)

చెస్‌లో ప్రసాద్‌కు ప్రథమ స్థానం

రాచర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉద్యోగుల జాతీయ చెస్ క్రీడా పోటీల్లో రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన నల్లగట్ల ప్రసాద్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందారు. ఈనెల 19వ తేదీన విజయవాడ జీఎంసీ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉద్యోగులకు చెస్ క్రీడా పోటీలు జరిగాయి. 94 మంది ఈ జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనగా అందులో ప్రసాదు మొదటి స్థానం సాధించారు.

నేడు గంగమ్మ, గౌరమ్మల నిమజ్జనం

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ, గౌరమ్మ నిమజ్జన కార్యక్రమం ఈనెల 22వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ తెలిపారు ఉదయం 9గంటలకు దేవాలయం నుంచి గంగమ్మ, గౌరమ్మలను తీసుకుని వెళ్లి భీమలింగేశ్వరస్వామి సమీపంలో గల సగిలేరువాగులో నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన

గిద్దలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 3వ రోజు శుక్రవారం ప్రేమసుధా మందిరం ఆవరణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర సంకీర్తన, నామసంకీర్తన కార్యక్రమాలు సామూహికంగా నిర్వహించారు. బాలవికాస్ బాలబాలికలచే నిర్వహించిన నాటక ప్రదర్శన అందరినీ అలరించింది.

హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు

ఆహార భద్రత అధికారి శివతేజ పట్టణంలోని పలుచోట్ల ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహారాన్ని పరిశీలించారు. ఆహార నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ పరిధిలోని 9 మందికి రూ.3.58 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి కందుల వసంతలక్ష్మి ఇంటింటికి వెళ్లి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, టౌన్ యూత్ అధ్యక్షుడు దొడ్డా దుర్గేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు,రామిరెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

తర్లుపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి జోష్నదేవి, ఒంగోలు భూసార పరీక్ష కేంద్రం ఏవోడీ స్వరూప భూసార పరీక్షల గురించి విద్యార్థులకు వివరించారు.

ఎన్జీవో నూతన కమిటీ ఎన్నిక

పొదిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నికలు శుక్రవారం స్థానిక సాయిబాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించారు. పొదిలి మండల అధ్యక్షుడిగా ఎల్. శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా షేక్ సంధానిబాష, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి. శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

పొదిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డులోని మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే ఈశ్వరమ్మ అనే మహిళా ఓ ఇంటిలో ఒంటరిగా ఉంటోంది. అదే వీధిలో నివాసం ఉంటున్న తన కుమార్తెల దగ్గరకు వెళ్లేందుకు ఇంటికి తాళం వేస్తుండగా అప్పటికే కాపుకాసిన దుండగులు మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు చైను లాక్కొని పరారైనట్లు బాధితురాలు ఈశ్వరమ్మ తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

అధ్వానం..!

గుంతలమయంగా మారిన రోడ్లు

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రహదారులు



గోతులమయమైన ఉల్లగల్లు-లక్ష్మీనగర్ రోడ్డు, తమ్మలూరు - పసుపుగల్లు మధ్య రోడ్డుపై లేచి పోయిన తారు



కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే జాతీయ, ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు పడిన సమయంలో రోడ్లపై పడిన గుంతల్లో నీరు నిలిచి మరింత ఛిద్రంగా తయారయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

- కనిగిరి నుంచి పొదిలి వెళ్లే 565 జాతీయ రహదారి రోడ్డులో కాశిరెడ్డికాలనీ, దేవాంగనగర్ వద్ద.. కనిగిరి నుంచి పామూరు వెళ్లే మార్గంలోని కొత్తూరు నుంచి డిగ్రీ కాలేజి వరకు రోడ్డు దెబ్బతిని మార్జిన్ వరకూ కోసుకుపోయింది.
- కనిగిరి నుంచి పునుగోడు వెళ్లే సింగిల్ రోడ్డు గ్రానైట్ క్వారీ లారీల రవాణా దెబ్బకు పూర్తిగా దెబ్బతింది.

సీఎస్‌పురం డీజీపేట వెళ్లే రోడ్డు దెబ్బతిని రోడ్డు మధ్యంలో గుంతలు ఏర్పడ్డాయి.

- కనిగిరి నుంచి పునుగోడు మీదుగా గుడిపాడు వెళ్లే రోడ్డు దెబ్బతింది.
- కనిగిరి-కందుకూరు మార్గంలో చింతలపాలెం, శంఖవరం, ఫైర్‌స్టేషన్ వద్ద రోడ్డుంతా దెబ్బతింది.
- కందుకూరు రోడ్డులో నుంచి పీసీపల్లి మండలంలోని అలవలపాడు వద్ద పీసీపల్లి వెళ్లే రోడ్డు చాలా చోట్ల కుంగిపోయి దెబ్బతినగా, మరి కొన్ని చోట్ల తారు లేచిపోయి మట్టిరోడ్డును తలపిస్తోంది.
- కనిగిరి నుంచి వేములపాడు వెళ్లే(ఓవీరోడ్డు) లోని హనుమంతునిపాడులో చాలా చోట్ల భారీగా దెబ్బతింది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరక ప్రాయంగా మారింది.



కంకర లేచిపోయి అధ్వానంగా మారిన విఠలాపురం-లింగాలపాడు రోడ్డు

- వెలిగండ్ల మండలంలోని మొగళ్లూరు నుంచి వేములపాడు రోడ్డులోని నాగిరెడ్డిపల్లి, మారంరెడ్డిపల్లి, కొండా రెడ్డిపల్లి వద్ద దాదాపు 8 కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాం మొత్తం రోడ్లను పట్టించుకున్న పాపానపోలేదు.

గోతులమయం.. ఆ రహదారులు

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రధాన గ్రామాలకు వెళ్లే పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రహదారులు గోతులమయమయ్యాయి. వాహనచోదకులు రహదారుల మీద ప్రయాణిస్తూ ప్రమాదాలబారినపడుతున్నారు. నాయుడుపాలెం నుంచి తమ్మలూరు వెళ్లే మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారి అధ్వానస్థితికి చేరింది. రహదారిపైన తారు లేచి కంకర బయట పడింది. పది నిమిషాలు పట్టే ప్రయాణం కాస్త అరగంట పడుతుంది. పెదఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్ వెళ్లే రహదారి గోతులమయమైంది. రెడ్డినగర్ నుంచి వయా బసవాపురం, శ్రీనివాస నగర్ వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి అధ్వానస్థితికి చేరింది. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల గోతుల్లో నీరు నిలబడటంతో రహదారి సైతం కానరాని పరిస్థితి ఏర్పడింది. వేముల నుంచి వయా కమ్మవారిపాలెం, ఉల్లగల్లు వచ్చే రహదారి కూడా దారుణంగా తయారైంది. రాజగోపాలరెడ్డి నగర్ దగ్గరైతే వాహనాలు సైతం వెళ్ల లేని పరిస్థితి. ఇంక సుంకరవారిపాలెం, భట్లపల్లి, నూజెండ్లపల్లి రహదారి కూడా దెబ్బతింది. ముండ్లమూరు నుంచిచ సింగనపాలెం వెళ్లే రహదారి కూడా పలు చోట్ల దెబ్బతింది. వేములబండ-ఈదర, ముండ్లమూరు-తమ్మలూరు, ఈదర-కొమ్మవరం వెళ్లే రహదారులు అధ్వానస్థితికి చేరాయి.

మొంథా తుఫాన్‌తో మరింత ఛిద్రం

దర్శి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలోని అనేక రోడ్లు గుంత లమయమై అధ్వానంగా మారాయి. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాం ఆసాంతం రోడ్లపై తట్టమట్టి కూడా పోయక గుంతలు పెరిగిపోయాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రోడ్లకు మరమ్మతులు చేశారు. ఇటీవల తుఫాన్ వలన భారీ వర్షాలు కురవటం, రోజుల తరబడి రోడ్లపై నీరు నిలవటం వలన మళ్లీ రోడ్లు దెబ్బతిన్నాయి. దర్శి మండలంలోని పోతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు, దర్శి-సామంతపూడి రోడ్డు, దర్శి-దేవవరం రోడ్డు గుంతలమయమై మార్జిన్లు కోసుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తాళ్లూరు మండలంలోని విఠలాపురం-లింగాలపాడు రోడ్డు, లక్కవరం-దోసకాయలపాడు రోడ్డు, తాళ్లూరు-శివరాంపురం రోడ్డు కురిచేడు మండలంలోని ఆవులమంద-నాయుడుపాలెం రోడ్డు, ముండ్లమూరు మండలంలోని ఉల్లగల్లు- లక్ష్మీనగర్ రోడ్డు, నాయుడుపాలెం-పెదరావిపాడు రోడ్డు, నూజెండ్లపల్లి-సుంక వారిపల్లిరోడ్డు, దొనకొండ మండలంలో దొనకొండ నుండి ఇండ్లచెరువు మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రోడ్లు గుంటలమయమై అధ్వానంగా మారాయి. దర్శి- ఆరవల్లిపాడు రోడ్డులో తూర్పువెంకటాపురం వద్ద రెండు కల్వర్టులు దెబ్బతిన్నాయి. దర్శి-పొదిలి రోడ్డులో కాటేరువాగుపై చప్టా కూలేదశకు చేరింది. ముప్పగంగవరం వద్ద గుండ్లకమ్మపై రైతులు సొంత నిధులతో నిర్మించిన చప్టా కూడా దెబ్బతింది. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీలైనంత త్వరలో రోడ్ల మరమ్మతులు చేసి రవాణా వ్యవస్థ మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కూలే దశకు చేరిన దర్శి-ఆరవల్లిపాడు రోడ్డులో చప్టా

బాధితురాలిని ఆదుకున్న అధికారులు

అవీఇవీ

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం బాధితురాలికి జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ప్రభుత్వ సహాయం అందజేశారు. మండలంలోని తూర్పువీరాయపాలేనికి చెందిన మాలే పాటి స్వప్నకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త గతంలోనే మృతి చెందాడు. జీవనాధారం లేక ఉపాధి చూపాలని ఈనెల 17న గ్రీవెన్స్ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంది. అందుకు స్పందించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆమెకు వెంటనే 25 కేజీల బియ్యం, 2కేజీల కంది పప్పు, 2 కేజీల వంటనూనె, ఆర్థిక సహాయం అందించాలని తహసీల్దార్‌కు శ్రావణ్‌కుమార్‌కు ఆదేశాలు ఇవ్వటంతో ఆ సరుకులు సమకూర్చారు. బాధిత మహిళకు శుక్రవారం ఇంటి నివేశన స్థలం పట్టాను అందజేశారు.



మహిళకు ఇంటి నివేశస్థలం పట్టా పంపిణీ చేస్తున్నజేసీ గోపాలకృష్ణ

రేషన్ సక్రమంగా ఇవ్వకపోతే చర్యలు

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయకుంటే డీలర్లకు అదే చివరి రోజు అవుతుందని తహసీల్దార్ ఆర్ వాసుదేవరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 65ఏళ్లు నిండిన వృద్ధులకు రేషన్ సరుకులను ఇంటి వద్దనే పంపిణీ చేయాలని చేయాలన్నారు. డీలర్ల దగ్గర వద్ద మిగిలి పోయి ఉన్న 1366 రేషన్ స్మార్ట్ కార్డులను రెండు రోజుల్లో పంపిణీ చేయాలని చెప్పారు. లేకుంటే క్రమశిక్షణ చర్యల కింద 6 ఏ కేసులు నమోదు చేస్తానన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే చర్యలు

పీసీపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ సాగును ప్రభుత్వం నిషేధించిందని, అయినా సాగు చేస్తే చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ చైర్మన్ సీహెచ్ ఉషా హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశమైంది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ నల్లబర్లీని సాగుచేయకుండా కమిటీ సభ్యులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తెల్లబర్లీ సాగు చేసే రైతులు తప్పనిసరిగా కంపెనీ ప్రతినిధుల నుంచి ఒప్పందపత్రం తీసుకునేలా చెప్పాలన్నారు. ఒప్పంద సమయంలో కంపెనీ ప్రతినిధులతో ఏమైనా సమస్యలు ఉంటే టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఏవో ఎస్.రంగాక్రిష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పశువైద్య శిబిరం

పీసీపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి) : పశువులకు తలెత్తే గర్భకోశ వ్యాధులపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని ఈవో మురళీకృష్ణ చెప్పారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 44గేదెలకు గర్భకోశ, 20గేదెలకు చూడి సంబంధిత మరో 12పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధుల నివారణకు పశుపోషకులకు ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, సీఎస్‌పురం ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, రమేష్, పీసీపల్లి, కంచర్లవారిపల్లి పశువైద్యాధికారులు ఆవులరెడ్డి, రాజశేఖర్, ఏహెచ్ఎ శ్రీవల్లి, నాయకులు రామయ్య, వెంగయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పాడె మోసిన ఎమ్మెల్యే ఉగ్ర



పాడె మోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీర్లదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, మాజీ సర్పంచ్ అట్లా మల్లికార్జునరెడ్డి(32) గుండెపోటుతో మరణించారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి శుక్రవారం మల్లికార్జునరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతిమ సంస్కారంలో పాల్గొని పాడె మోశారు. ఈ సందర్భంగా మల్లికార్జునతో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని మనోధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, బాలు ఓబులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, ఫిరోజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేఎస్ఎస్ సభ్యుల జాబితాను అందజేయాలి

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామ కమిటీ సభ్యులు త్వరితగతిన కేఎస్ఎస్ సభ్యుల జాబితాను అందచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు కోరారు. మండలంలోని కంభాలదిన్నె, రేణిమడుగు, రావిగుంటపల్లి పంచాయతీకి సంబంధించిన కేఎస్ఎస్ సభ్యుల జాబితాను టీడీపీ అధ్యక్షుడికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కంభాలదిన్నె, రావిగుంటపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మన్నం రమణయ్య, కంచర్ల శ్రీను, గోళ్ల రమణయ్య రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆటల పోటీలకు మస్తాన్‌వలి

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దర్శికి చెందిన ఉపాధ్యాయుడు మస్తాన్‌వలి జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. సివిల్ సర్వీసెస్ ఆటల పోటీల్లో భాగంగా విజయవాడలో జరిగిన క్యారమ్స్ పోటీల్లో ప్రతిభచూపారు. ఆయన మండలంలోని బసిరెడ్డిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవి, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు, మెడలకు బ్యాండ్‌లు కట్టడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుంచి పశువులను రక్షించుకోవచ్చునని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని కోవిలంపాడు, మిట్టపాలె గ్రామాల్లో జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పశువైద్య సహాయకురాలు అమృత సహకారంతో గ్రామంలోని పలు గేదెల మెడలకు రేడియం బ్యాండ్‌లను శుక్రవారం కట్టి పశుపోషకులకు అవగాహన కల్పించారు.

ఘనంగా పోలిపాడ్యమి వేడుకలు

దొనకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దొనకొండ నాల్గురోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో శుక్రవారం తెల్లవారుఝామున పోలిపాడ్యమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆశ్రమ ఆవరణలో ఓంకారం, శివలింగాకారం, స్వస్తిక్ ఆకారాలతో దీపాలు వెలిగించారు. అనంతరం ఆశ్రమ ఆవరణలోని బావిలో పసుపు, కుంకుమ, అక్షితలు వేసి అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి వదిలారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అర్చకులు మణిబాబు శర్మ, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

అందుబాటులో తేమ శాతం మిషన్లు

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యంలో తేమ శాతం నమోదు మిషన్లు అందుబాటులో ఉన్నట్లు ఏవో బి.ప్రసాదరావు తెలిపారు.తాళ్లూరులోని రైతుసేవాకేంద్రంలో తేమశాతం నమోదు యంత్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాలందు తేమశాతం నమోదు యాంత్రాల వద్దకు ధాన్యం తీసుకెళ్లి తేమ శాతం తీయించాలన్నారు.

పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కనిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామానికి చెందిన బాగని సురేష్(25) అనే యువకుడు అయ్యప్ప మాల ధరించాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలసి బుధవారం పొదిలి నుంచి భైరవకోన, మిట్టపాలెం నారాయణ స్వామి గుడిని సందర్శించుకున్నారు. అదే రోజు రాత్రి కనిగిరి మండల పరిధిలోని నందనమారెళ్లలోని శివాలయం గుడిలో నిద్రిస్తుండగా, సురేష్ పాముకాటుకు గురయ్యాడు. వెంటనే ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ శ్రీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మోపాడు ఆయకట్టుదారుల సమావేశం

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆయకట్టుదారులతో శనివారం ఉదయం 10 గంటలకు బంగ్లా వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్‌ఏఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వచ్చిన తుపాన్ ప్రబావంతో కురిసిన భారి వర్షాలతో రిజర్వాయర్‌లో 17 అడుగుల మెర నీటి మట్టం చేరిందని, రైతుల అభిప్రాయాలు మేరకు పంటలు సాగు చేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇరువురికి డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదఉల్లగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జే రాజరాజేశ్వరికి డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందారు. అదే విధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాలాజీరెడ్డి కూడా డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు.

తాళ్లూరు మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి మృతి



పెద్దిరెడ్డి(ఫైల్)

తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కురువృద్ధుడు, తాళ్లూరు మాజీ సర్పంచ్ ఇడమకంటి పెద్దిరెడ్డి(90) వయోభారంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన బెంగళూరులోని కుమారుడు నివాసం వద్ద ఉంటున్నారు. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దిరెడ్డి తండ్రి బ్రహ్మారెడ్డి స్వాంతంత్ర్య సమరయోధునిగా తామ్రపత్రం కూడా పొందాడు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన పెద్దిరెడ్డి కాంగ్రెస్ వాదిగా ముద్రపడ్డారు. 2013 జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 950 ఓట్ల ఆధిక్యతతో గెలుపొంది ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మాజీ సర్పంచ్ మృతిపట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. మొత్తం 174 అర్జీలు అందజేయగా వాటిల్లో 119 రెవెన్యూ పరమైన సమస్యలు కాగా మిగిలినవి విద్యుత్, గృహనిర్మాణం, పింఛన్లు, వాహనమిత్ర తదితర సమస్యలకు సంబంధించినవిగా గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకతీతంగా వారి సమస్యలు పరిష్కరిస్తూ ముందుకుసాగుతున్నామన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు వివరించిన సమస్యలను నోట్ చేసుకున్నామని, అన్నీ సమస్యలను పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సైతం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సాధ్యం కాని పనుల గురించి ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పేద ప్రజల వైద్యం ఖర్చులకు దాదాపు 1000 మందికి కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఇప్పటికే అందజేశామన్నారు. త్వరలో దొనకొండ మంచి పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందబోతుందని చెప్పారు. ఇటీవల సీఎం ప్రకటించిన బీడీఎల్ సంస్థ ఆధ్వర్యంలో రక్షణ రంగ పరిశ్రమ త్వరలో ఏర్పాటు కాబోతుందన్నారు. అనంతరం ఆరుగురికి సీఎం సహాయ నిధి చెక్కులను, 70 మంది పారిశుధ్య కార్మికులకు, 15 మంది తుఫాన్ బాధితులకు అసిస్టు సంస్థ అందజేసిన బియ్యం, కందిపప్పు, నూనె తదితర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో వసంతరావునాయక్, ఎస్ఐ త్యాగరాజు, నేతలు మోడి ఆంజనేయులు, నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, పులిమి రమణాయాదవ్, మగ్బూల్‌అహమ్మద్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం

దర్శి నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ భరోసా ఇచ్చారు. మండలంలోని బట్టువారిపల్లి పొలాల్లో పొగాకు అల్లుతున్న మహిళా రైతులతో ఆమె మాట్లాడారు. పొగాకు పంట దిగుబడి గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పొగాకు అల్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అనంతరం దర్శిలో ముంథా తుఫాన్ బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మున్సిపాలిటీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల పార్టీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొగాకు రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

గ్రామాల్లో పారిశుధ్యం సమస్య తలెత్తనివ్వద్దు

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో పద్మ చెప్పారు. ఆమె మండలంలోని పెదఉల్లగల్లు సచివాలయం వద్ద మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు జే రాజరాజేశ్వరి, షహీనా బేగం, మౌలాలి, గురునాథం, సర్పంచ్‌లు జే నాగేంద్రం పిచ్చయ్య, జే గురవయ్య, ఎం శ్రీనివాస రెడ్డి, జీ సుబ్బారెడ్డి, వీ బాల సుందర రావు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రలు చిత్తశుద్ధితో పనిచేయాలి

పామూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్లాప్‌మిత్రలు చిత్తశుద్ధితో పనిచేసి ఫలితాలు సాధించాలని ఎంపీడీవో బ్రహ్మయ్య చెప్పారు. పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో క్లాప్ మిత్రలకు, గ్రీన్‌గార్డ్స్ పీఆర్‌పీలకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, థీమ్ - 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామూరు నీటి సంఘం అధ్యక్షుడు పాలపర్తి రమణయ్య, డిప్యూటి ఎంపీడీవో సుందరరామయ్య, పంచాయతీ కార్యదర్శులు అరవిందరెడ్డి, కృష్ణమూర్తి, ఇండ్ల హరినారాయణ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశభ్రంగా ఉంచుకోవాలి

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కంభంపాడు గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, డిప్యూటి ఎంపీడీవోలు రమణయ్య, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

పీసీపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుదేవారిపాలెంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లకు పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో క్రిష్ణారావు, సర్పంచ్ కనపర్తి శాంసన్, డిప్యూటీ ఎంపీడీవోలు వేణుగోపాల్‌రెడ్డి, రాంప్రసాద్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో...

వెలిగండ్ల, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా అందరికీ అవగాహన కల్పించే బాధ్యత అధికారులదేనని డీఎల్‌డీవో శ్రీనువాసులరెడ్డి చెప్పారు. మండలంలోని మొగళ్లూరుగ్రామ పంచాయతీలో థీమ్-5 శిక్షణ కార్యక్రమం, పరిశుభ్రతపై ప్రజాపతినిధులతో, అధికారులతో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి కొండయ్య, కిరణ్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరులో...


తాళ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు సహకారం అందించాలని డీజీవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సువార్త చెప్పారు. మండలంలోని మాధవరం గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా రూపొందించేందుకు శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ గ్రామ పంచా యతీల కొరత ఎక్కువగా ఉందని, ఒక్కోకార్యదర్శి నాలుగు సచివాలయాలకు ఇంచార్జిలుగా ఉన్నందున పనిభారంతో అన్ని సచివాలయాలకు సరిగా వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను నియమించాలని డీజీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ రేణుక, డిప్యూటీ ఎంపీడీవో నాగమల్లేశ్వరి, మాజీ సర్పంచ్ పాలెపోగు దాసు, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సోము శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లిలో అధికారుల శిక్షణలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 22 నవంబరు 2025





- ఎన్‌హెచ్ఏఐ నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు ఫైనల్ డీపీఆర్
- బహిర్గతం కావడంతో రైతుల ఆగ్రహం
- 140 మీటర్ల భూసేకరణ, ఇతరత్రా ఖర్చులకే రూ. 3,117 కోట్లు..
- 250 మీటర్లంటే రూ.5 వేల కోట్లకు పైగానే నిధుల అవసరం

అంత.. వేడల్పా..!?

250 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్..

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని అవుటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) తుది డీపీఆర్(సవివర ప్రాజెక్టు నివేదిక) జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నుంచి కలెక్టరేట్‌లకు చేరుకుంది. దాదాపుగా 190 కిలోమీటర్ల వ్యాసార్థంతో గుంటూరు, పల్నాడు, ఎన్‌టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలో నిర్మించనున్న ఈ రాజధాని మణిహారం వెడల్పుని పెంచుకొంటూ పోతున్నారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ ప్రతిపాదించారు. ఆ తర్వాత భవిష్యత్తు అవసరాల పేరుతో 140 మీటర్ల వెడల్పునకు కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించింది. ఇప్పుడు 250 మీటర్లు(పావు కిలోమీటర్) వెడల్పుతో తుది డీపీఆర్‌ని ఎన్‌హెచ్ఏఐ ఆమోదం తీసుకొని ఐదు జిల్లాల కలెక్టరేట్‌లకు పంపించింది. డీపీఆర్‌లో పొందుపరిచిన ఎలైన్‌మెంట్ ప్రకారం సెంటర్ లైన్ నుంచి ఇరువైపులా 125 మీటర్ల భూసేకరణ

(మిగతా 6లో)

భూ సేకరణకు రెవెన్యూ సిద్ధం

గుంటూరు జిల్లాలోని 40 గ్రామాల్లో 4792.83 ఎకరాలను సేకరణకు ప్రతిపాదనలు రూపుదిద్దుకొంటున్నాయి. అలానే పల్నాడు జిల్లాలో 1,181 ఎకరాలను సేకరించబోతున్నారు. ఇదే విధంగా కృష్ణ, ఏలూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లో మరో 5 వేల ఎకరాలకు పైగానే సేకరించాల్సి ఉంటుంది. భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్లు వెలువడిన తర్వాత అనేకమంది కోర్టు మెట్లు ఎక్కాలని భావిస్తున్నారు. అవి తేలేసరికి ఎన్ని సంవత్సరాల సమయం పడుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో 140 మీటర్ల వెడల్పునకే పరిమితమై భూసేకరణ చేపడితే ప్రాజెక్టు ఖర్చు తగ్గడంతో పాటు రైతుల అభ్యంతరాలు కూడా తగ్గుతాయి. అలానే నీటివనరులకు నష్టం జరగదు. గ్రామాల్లో నివాసాలు, పరిశ్రమలు తొలగించాల్సిన పరిస్థితి ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గాయత్రినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, వాసిరెడ్డి లింగమూర్తి



గాయత్రి నగర్‌లో నిర్మించిన రహదారిని చూపిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అక్షరం అండగా..

- ప్రజలు అడిగారు.. పాలకులు స్పందించారు
- రెండు నెలల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- వినుకొండలో రూ.63.60 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- స్థానికుల హర్షాతిరేకాల మధ్య ప్రారంభించిన చీఫ్‌విప్ జీవీ
- ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి కృషికి ప్రశంసలు

సమస్యలు పరిష్కారం

- రెండేళ్లలో ఇంటింటికి తాగునీరు అందించడమే జీవితాశయం : చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంతో వినుకొండలో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. రోడ్లు లేక.. డ్రెయినేజీ వ్యవస్థ లేక ఆయా ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంగా గతంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. వర్షాల సమయంలో అయితే వారు ఇళ్ల నుంచి బయటకు కూడా అడుగు పెట్టలేక అల్లాడిపోతుండేవారు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం ద్వారా గాయత్రినగర్, కొట్నాల్చ వీధి ప్రాంతవాసులు తమ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాడు వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించగా ప్రజలు స్వయంగా తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్రజ్యోతి వేదికగా కోరారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను జీవీకి అందజేసి తమ బాధలను వినిపించారు. మహిళలు తెలియజేసిన సమస్యలపై స్పందించిన జీవీ వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. ప్రజలు కోరిన ఆయా పనులు పూర్తి కావడంతో శుక్రవారం వేడుకగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మట్టి రోడ్లతో, డ్రెయిన్లు లేక పడిన అవస్థలు తీరడంతో

(మిగతా 6లో)



పనులు ఇలా..

- కొట్నాల్చవీధిలో రూ18.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు

ఎన్ఎస్‌పీ కాలనీకి వరాలు..

ఎన్ఎస్‌పీ కాలనీలో చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం, గుర్రం జాషువ పేరుతో లైబ్రరీ, ఇండోర్ స్టేడియం, షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపం, హోల్‌సెల్ కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు.



స్థానికులు, అర్జీలతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



యూరియా బస్తా.. రూ.500

బ్లాక్‌తో కొండెక్కిన ధర

- రైతులను పిండేస్తున్న వ్యాపారులు
- ఖరీఫ్ పరిస్థితులు రబీలోనూ పునరావృతం
- కేటాయింపులు.. అమ్మకాలు అంతటా అక్రమమే

(చీరాల, ఆంధ్రజ్యోతి)

ఎరువులు పుష్కలంగా ఉన్నాయి.. ఎక్కడా కొరత లేదు. అవసరం మేరకు ఎంత కావాలంటే అంత సరఫరా చేస్తున్నాం. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. అదనపు ధర కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.. ఎవరైనా అలా వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి ఆ వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.. అని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. రెండు రెట్ల ధరకు యూరియా విక్రయిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ధర గురించి ప్రశ్నిస్తే యూరియా లేదనే సమాధానంతో రైతులు నిరాశ చెందుతున్నారు. అత్యంత తక్కువ ధరకు లభ్య మవ్వాల్సిన యూరియాను బ్లాక్ చేసిన వ్యాపారులు ధరను అమాంతం పెంచేశారు. వాస్తవానికి యూరియా బస్తా రూ.266.50. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో బస్తా రూ.500 చెల్లిస్తే తప్ప దొరకడంలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా అంతటా ఇదే పరిస్థితి. కృత్రిమ కొరత సృష్టించి రైతుల నుంచి ఎక్కువ మొత్తం లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎరువులు కేటాయింపులు.. అమ్మకాలు అన్నింట్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. రబీలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో యూరియా వాడకం ఎక్కువగా ఉంటుంది. కాగా ఖరీఫ్‌లో ఏ పరిస్థితి సృష్టించారో అదే పరిస్థితి రబీలోనూ సృష్టించేందుకు కొందరు కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతుంది. రెండో పంట కింద సాగు చేసే మొక్క జొన్నలో అధిక దిగుబడి కోసం ఎకరాకు 12 నుంచి 16 బస్తాల యూరియా

(మిగతా 6లో)

స్త్రీశక్తి.. విజయవంతం

అద్దంకి బస్టాండ్ తనిఖీలో జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణలో కంటే మన రాష్ట్రంలో విజయవంతంగా స్త్రీశక్తి పథకం అమలవుతుందని ఆర్టీసీ నెల్లూరు జోనల్



ప్రయాణికులతో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేశారు. పారిశుధ్యం, తాగునీటి వసతి, ఇతర సదుపాయలను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్త్రీశక్తితో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల అవసరా లకు తగ్గట్లు సర్వీసులతో పాటు బస్టాండ్లలో సౌకర్యాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బస్సులు పెంచుతామన్నారు. అద్దంకి డిపోకు కూడా అదనంగా సర్వీసులు కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పురుషులు ఆయన దృష్టికి తేగా.. మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎం మహబూబీ, సీఆర్సీ కొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావన వశిష్ట

- 117 సేకరణ కేంద్రాలను ప్రారంభించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి ప్రణాళికతో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా, మండల, సచివాలయ స్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందనే విషయంపై వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. మండలస్థాయిలో ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో, ఎంత దిగుబడి వస్తుందనే దానిపై ఎక్కడికక్కడ అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆర్.ఎస్‌కెలకు ఏరోజు ఎంతమంది రైతులు వస్తారో ముందస్తుగా అంచనా వేసుకుని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 117 ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. రైతులతో వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. జేసీ భావనవశిష్ఠ మాట్లాడుతూ 60 తేమ యంత్రాలు సిద్ధంగా ఉంచామని, 73 మిల్లులను ఎంపిక చేశామన్నారు. 13 లక్షల గోనె సంచులను సిద్ధం చేశామన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలన్నారు. అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి అమీర్‌బాషా, మేనేజర్ శివపార్వతి, వ్యవసాయశాఖ డీడీ అన్నపూర్ణ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, ఆర్డీవోలు, మండల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



రాజ్యలక్ష్మికి.. కన్నీటి వీడ్కోలు

- 14 రోజుల తర్వాత అమెరికా నుంచి కారంచేడుకు మృతదేహం



రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

కారంచేడు(పర్చూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) మృతదేహం శుక్రవారం స్వగ్రామం కారంచేడుకు చేరుకుంది. అమెరికా నుంచి 14 రోజుల తర్వాత ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వాహనం నుంచి మృతదేహాన్ని దించగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉన్నత స్థాయిలో తమ బిడ్డ వస్తుందని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు గుండెకోత మిగిలింది. మృతదేహానికి గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థిని కడచూపు కోసం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.



డీసీసీబీ అక్రమార్కులపై వేటు

- ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్
- లాల్‌పురం రాము సహా పాలకవర్గంపై క్రిమినల్ చర్యలు

నల్లపాడు బ్రాంచ్‌లో రూ.22.25 కోట్ల కుంభకోణం జరిగినట్లు నిర్ధారణ

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అక్రమార్కులపై వేటు పడింది. నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇద్దరు మాజీ సీఈవోలు కృష్ణవేణి, అజయ్‌కిశోర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ పాలకవర్గం శుక్రవారం తీర్మానించింది. వైసీపీ హయాంలో జీడీసీసీబీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. ప్రధానంగా నల్లపాడు బ్రాంచ్‌లో ప్లెడ్జి రుణాల మంజూరు, డ్వాక్రా గ్రూపుల పేరుతో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. ప్లెడ్జి రుణాల పేరుతో రూ.13.15 కోట్లు, మెప్మా పరిధిలో రూ.6.05 కోట్లు, డీఆర్‌డీఏ స్వయం సహాయ సంఘాలకు రూ.1.41 కోట్లు, జగనన్న మహిళా ధీమా కింద రూ.1.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.37 లక్షలు మంజూరు.. ఇలా రూ.22.25 కోట్లు అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమాలకు బాధ్యులుగా అప్పటి పాలకవర్గం రాతంశెట్టి సీతారామాంజనేయు(లాల్‌పురం రాము)లుతో పాటు పాలకవర్గ సభ్యులుగా తేల్చారు. ఈ క్రమంలో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రస్తుత చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. అలానే ప్లెడ్జి రుణాలకు సంబంధించి 191 మంది, మెప్మా పరిధిలో 212 మంది, డీఆర్‌డీఏ పరిధిలో 60 మంది, జగనన్న మహిళా ధీమా కింద వ్యక్తిగత రుణాలు పొందిన 320 మంది, నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలిక రుణాలు పొందిన మరో 13 మంది ఇలా మొత్తం 796 మందిపై సివిల్ చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. 186 మందిపై క్రిమినల్, 27 మందిపై క్రమశిక్షణా చర్యలు, బ్యాంకు సిబ్బంది 10 మంది, డీఆర్‌డీఏలో ఆరుగురు, మెప్మా సిబ్బంది 11 మందిపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సస్పెన్షన్ చేస్తూ తీర్మానం

విచారణ నివేదిక నేపథ్యంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన అధ్యక్షతన శుక్రవారం బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో జరిగిన సమావేశంలో ఇద్దరు మాజీ సీఈవోలపై వేటు వేస్తూ తీర్మానం చేశారు. మొత్తానికి బ్యాంకులోని తాజా పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి.



బాపట్ల మండల పరిధిలోని మూలపాలెం-జిల్లెళ్లమూడి రోడ్డు దుస్థితి

రోడ్లు.. గోతులమయం

- వర్షాలతో అధ్వానంగా మారిన వైనం
- 70 శాతం బిల్లుల చెల్లింపులో జాప్యం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రోడ్డుపై గుంత కనపడకూడదు. రోడ్లపై గోతులతో వాహనదారులు ఇబ్బందులు పడకూడదు. సంక్రాంతి కల్లా రోడ్ల మరమ్మతులు చేయాలి. గత వైసీపీ హయాంలోని పరిస్థితి ఎక్కడా కనిపించకూడదు.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు. గతంలో ఉన్నంతగా గోతులు లేకపోయినా పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రభుత్వం ఒక మారు గోతులను పూడ్చివేయగా తుఫాన్, భారీ వర్షాలతో ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానంగా మారాయి. తూతూమంత్రంగా చేపట్టిన పనులు కూడా వర్షాలతో బహిర్గమయ్యాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు పంచాయతీ, మున్సిపల్ పట్టణాల్లో రోడ్లు గోతులతో నిండి.. వాహన చోదకులకు నరకం చూపుతున్నాయి. గతంలో కేటాయించిన నిధులతో చేపట్టిన పనుల్లో 70 శాతం బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో 108 పనులకు రూ.31 కోట్లను గతేడాది చివరిలోనే కేటాయించగా రూ.27 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తుఫాన్‌తో గ్రామీణ రహదారులు 147 కిలోమీటర్లలో, ఆర్‌అండ్‌బీ రోడ్లు 152 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. బాపట్ల మండలం మూలపాలెం -జిల్లెళ్ల మూడి రోడ్డు వాహనదారులకు నరకం చూపు తోంది. చిన్న పాటి వర్షానికే రోడ్డుపై చెరువును తలపిస్తోంది. కంకటపాలెం, చెరుకూరు రోడ్లు పగుళ్లతో ప్రమాదకరంగా ఉన్నాయి. చీరాల పరిధి లోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెం, ఏరి యా వైద్యశాల రోడ్లు నరకప్రాయంగా మారా యి. పర్చూరు పరిధిలో దాదాపు 52 గ్రామీణ రోడ్లు, అద్దంకి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో ఆర్‌అండ్‌బీ 21, పంచాయతీరాజ్ 82 నరసాయపాలెం--నరసాయపాలెం రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



చీరాల మండల పరిధిలోని ఆంధ్రకేసరి నగర్‌లో భయానకంగా ప్రధాన రహదారి



సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇతర అధికారులు

ఎలక్ట్రిక్ టగ్ బిల్డింగ్ శంకుస్థాపనకు సీఎంకు ఆహ్వానం

● మారిటైంబోర్డు ఆధ్వర్యాన త్వరలో కాకినాడలో రూ.80 కోట్లతో నిర్మాణం

కొండపి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మారిటైంబోర్డు ఆధ్వర్యంలో కాకినాడలో రూ.80 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఎలక్ట్రిక్ టగ్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి ఈనెల 29న రావాలని ఆహ్వానిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడిని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, శాన్‌మారిటైం ఇండియా షిప్ బిల్డింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఎస్‌కె.అహ్మద్ ఆలీషా శుక్రవారం రాత్రి కలిసి ఆహ్వానించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనలో భాగంగా, మేకిన్ ఇండియా పాలసీలో భాగంగా దేశంలోనే తొలిసారిగా కాకినాడ పోర్టు వద్ద కంపెనీ ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ నౌకల తయారీని అందుబాటులోకి తేనున్నారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగావకాశాలు లక్ష్యంగా ఈ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. నౌకాయాన రంగంలో పర్యావరణ హితమైన, కార్బన్ ఉద్గారాలను తగ్గించే సాంకేతికతతో సాన్ మారిటైమ్ కంపెనీ దేశంలోని ప్రముఖ మెరైన్ డిజైన్ సంస్థలు, సమగ్ర మెరైన్ ఎలక్ట్రిక్ సొల్యూషన్ ప్రొవైడర్లు, ఎలక్ట్రిక్ మొబిలిటీ టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం చేసుకుని ఎలక్ట్రిక్ నౌకలను నిర్మించనుందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు సత్య, అహ్మద్ ఆలీషా వివరించారు.

నేడు డ్వాక్రా మహిళలకు మెగా రుణమేళా

● పాల్గొననున్న మంత్రి స్వామి, సత్య

కొండపి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ- వెలుగు ఆధ్వర్యంలో కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల స్థాయిలో శనివారం ఉదయం స్థానిక కామేపల్లి రోడ్డులోని సాయిసీతారామ కల్యాణమండపంలో డ్వాక్రా మహిళలకు రూ.7 కోట్లకుపైగా మెగా రుణమేళా, యూనిట్లు పంపిణీ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నారు.

కార్యక్రమానికి దాదాపు వెయ్యి మంది మహిళలు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమేరకు శుక్రవారం ఏర్పాట్లను ఎంపీడీవో బి.రామాంజనేయులు, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్ పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

● జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు(రూరల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్ల యజమానులు పూర్తిగా సహకరించాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయలో జిల్లాలోని రైస్ మిల్లర్ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో రబీసీజన్‌లో 25వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందని, దీనిని కొనుగోలుకు గోదాములు సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు తరువాత రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో44 రైతు సేవాకేంద్రాలు, 26 సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాంభించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం వరలక్ష్మి, డీఎస్‌వో పద్మశ్రీ, రైస్‌మిల్లర్స్ సంఘ ప్రతినిధి శ్రీనివాసరావు, మిల్లర్లు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి నిధుల కోసం వినతి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందరన్భంగా నగర అభివృద్ధి కోసం నిధులు అవసరతను తెలియజేశారు. పోతురాజు కాలువ ఆధునికీకరణ, నల్లకాలువ, కొత్తపట్నం బీచ్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ముఖ్యమంత్రి చంద్ర బాబును కలిపి విన్నవించిన ఎమ్మెల్యే ముత్తుముల



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంకు చెందిన పలు సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో గత నెలలో బీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ వలన గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో పలు చెరువులు, రోడ్ల మరమ్మతులకు గురయ్యాయని, వాటి కోసం అత్యవసర నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 4,379 రైతులకు సంబంధించి 1,844.21 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

పశు పోషకులకు దాణా పంపిణీ

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల, ఈదర పశు వైద్యశాలలోని పశు పోషకులకు 50 శాతం సబ్సిడీపై మంజూరైన దాణాను శుక్రవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కాసిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బుర్రి అంజయ్య, ఎంపీటీసీ సభ్యుడు పాలపర్తి సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గతుకుల దారులు

● అధ్వానపు రోడ్లపై ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్న వాహన చోదకులు



రాళ్లు తేలిన బల్లికురవ- మార్టూరు రోడ్డు

అద్దంకి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రాంతంలో పలురోడ్లు, వంతెనలు వాహన చోదకులను బెంబేతెత్తిస్తున్నాయి. ప్రధానంగా అద్దంకి-దర్శి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుండ్లకమ్మ నదిపై 4 దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన రెండు దశాబ్దాల క్రితం కుంగింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరిం చారు. అయితే ప్రస్తుతం వంతెన పూర్తిగా శిథిలావస్థ కు చేరి గోతులు పడ్డాయి. అద్దంకి- రేణింగవరం రోడ్డులో మూడు చోట్ల ఉన్న లోలెవల్ వంతెనలు శిథిలమయ్యాయి. దశాబ్ద కాలం క్రితం డబుల్ రోడ్డుగా మార్చినా కొత్త వంతెనలు నిర్మాణం జరగ లేదు.. బల్లికురవ- మార్టూరు రోడ్డు రూపురేఖలు కోల్పోయింది. దీంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం

చీరాల : పట్టణంల మొంథా తుఫాన్ ప్రభావంతో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో చీరాల ఏరియా వైద్యశాల మార్గంలో రహదారిని పగులకొట్టి కొంత మేరకు డ్రయినేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అనంతరం కొంత మేరకు రోడ్డును సరిచేసి మిగిలిందంతా అలాగే వదిలేశారు. దీంతో రాకపోకలన్ని రోడ్డుకు ఒకవైపు జరుగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగకుండా పోలీసులు మాత్రం హోర్డింగ్‌లు ఉంచారు. రోజుల తరబడి ఈ సమస్య పరిష్కారం కాకుండా ఉండిపోయింది. అత్యవసర వైద్యం, సాధారణ వైద్యం కోసం రోగులు, అంబులెన్స్ ద్వారా ఈ మార్గంలోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈక్రమంలో రహదారిని తక్షణమే బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మండల పరిధిలోని ఆంధ్రకేసరి నగర్ గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించి సుమారు మూడు దశాబ్దాలు దాటింది. ప్రస్తుతం ఆ మార్గం పూర్తి అధ్వానంగా తయారైంది.

పర్చూరు : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధి వైపు కన్నెత్తి చూడక పోవటంతో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసిన గుంతల మయం కావడం తోపాటు, కంకర రాళ్ళు లేచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఇటీవల వర్షాల నేపథ్యంలో రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. పర్చూరు నుండి ఇంకొల్లు వెళ్ళే పాత మద్రాసు రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డులో ప్రయాణాలు సాగించాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించినా సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో సమస్య తీవ్రంగానే ఉంది. ఇక పర్చూరు నుండి జాగర్లమూడి మీదుగా యద్దనపూడి, గన్నవరం, మార్టూరు వెళ్ళే రోడ్డు అత్యతం దయనీయంగా ఉంది. అలాగే పర్చూరు మండల పరిధిలోని బోడవాడ నుండి రమణాయపాలెం మీదుగా జిల్లా కేంద్రం బాపట్లకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు కనీసం మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





గోతులతో నిండిన బోడవాడ- చెరుకూరు రహదారి, ఆంధ్రకేసరి నగర్‌లో భయానకంగా ప్రధాన రహదారి

అంత...వేడల్పా..!?

(5వ పేజీ తరువాయి)

చేయాలని కోరింది. ఆ మేరకు సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ఓఆర్‌ఆర్ కోసం 250 మీటర్ల వెడల్పుతో 190 కిలోమీటర్ల పొడవునా భూసేకరణ చేపట్టాలని నిర్ణయించడంపై భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆగ్రహం..

ఓఆర్‌ఆర్ ఫైనల్ డీపీఆర్‌ని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు కొన్ని నెలల క్రితం పంపించారు. అందులో 140 మీటర్ల వెడల్పునకు పరిమితమై భూసేకరణ చేపడతామన్నారు. ప్రాజెక్టు ఖర్చు రూ. 24,791 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం కూడా తెలిపారు. భూసేకరణకు అయ్యే ఖర్చు రూ.3,117 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే తన వాటాగా భరించేందుకు అంగీకారం తెలిపిం ది. దీనిపై రైతులు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఎప్పుడైతే ఎవరి అభిప్రాయాలను తీసుకోకుండా భూ సేకరణని 250 మీటర్ల వెడల్పునకు నిర్ణయించి కలెక్టరేట్‌లకు ప్రతిపాదనలు పంపించారో అప్పటి నుంచి రైతులు ఆగ్రహం పెల్లుబుకుతోంది. అంత వెడల్పుతో భూసేకరణ చేపడితే తాము భూములను సింహభాగం కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అంత పెద్ద హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌నే 150 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. అందులో ఎనిమిది వరసల రహదారి, మీడియన్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, గ్రీన్ స్పేసెస్ ఉన్నాయి. దాని కంటే అదనంగా మరో 100 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్‌ఆర్ భూసేకరణ చేపట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

భూసేకరణకు ఖర్చు రెట్టింపు

అమరావతి ఓఆర్‌ఆర్ కోసం ఎన్‌టీఆర్ జిల్లాలోని 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కిలోమీటర్లు, ఏలూరులో ఒక మండలంలోని 8 గ్రామాల్లో 18.760 కిలోమీటర్లు, కృష్ణ జిల్లాలో ఐదు మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో 40 గ్రామాల్లో 67.650 కిలోమీటర్లు, పల్నాడు జిల్లాలో 2 మండలాల్లో 9 గ్రామాల్లో 17.230 కిలోమీటర్ల పొడవునా నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఓఆర్‌ఆర్‌కి లింకుగా మరో రెండు రోడ్లను కూడా 19.300 కిలోమీటర్లతో నిర్మించనున్నారు. పెరిగిన వెడల్పు ప్రకారం భూసేకరణకే రూ.5 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని అంచనా. పైగా పెంచిన వెడల్పు కారణంగా పలు పరిశ్రమలు, నివాసిత ప్రాంతాలను కూడా తొలగించాల్సి ఉంటుంది. వాటికి నష్టపరిహారం రూపంలో అదనంగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు నెలల క్రితం అమరావతి ఓఆర్‌ఆర్‌ని ఆరు వరసలు, ఇరువైపులా సర్వీసు రోడ్లకు మాత్రమే ఆమోదం తెలిపింది. అప్పుడు 140 మీటర్ల వెడల్పునకే ప్రతిపాదించింది. ఇప్పుడు 250 మీటర్లు అంటే ఆ వెడల్పులో భూమిని తీసుకొని ఏ అవసరాలకు రిజర్వు చేసి పెట్టుకొంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

యూరియా బస్తా... రూ.500

(5వ పేజీ తరువాయి)

వాడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఎప్పుడో గుర్తించింది. పల్నాడు ప్రాంతంలో మిరప రైతులు కూడా యూరియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. మాచర్లలో యూరియా రూ.420 నుంచి రూ.460కి తక్కువ అమ్మే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో చాలాచోట్ల రూ.450 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. కొందరు రైతుల పేరుతో కొందరు, పలుకుబడి ఉపయోగించి మరికొందరు ముందుగానే కొనుగోలు చేసి వాటినే రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

మేలుకోకపోతే ముప్పే..

ఖరీఫ్‌లో కేటాయింపులకు మించి ప్రభుత్వం యూరియాను సరఫరా చేసింది. అయినా కొరత ఉన్నట్లు ప్రచారం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు వెళ్లిన వందల టన్నుల యూరియా కొందరికి మాత్రమే పంచేయడంతో వాస్తవ రైతులు కొరతతో ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రబీలో ఎలా ఉంటుందోనన్న దానిపై సందిగ్ధం ఏర్పడుతుంది. వాస్తవానికి రబీలో గుంటూరు జిల్లాకు 55840 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం అవుతుంది. కానీ నిల్వలు ఆ మేరకు వస్తాయా లేదా అన్న దానిపై అనుమానం నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం నిల్వల్లో 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీ లకు, 30 శాతం డీలర్లకు కేటాయిస్తుంది. లింక్ ఉత్పత్తులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు చెబుతున్నాయి.

అక్షరం అండగా.. సమస్యలు పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

గాయత్రినగర్, కొట్నాల్ల వీధివాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల సమస్యల ఆంధ్రజ్యోతి ద్వారా పరిష్కారం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. గాయత్రినగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని మహిళలు కోరగా రూ.45 లక్షలతో నిర్మించారు. ఈ పనులకు జీవీ శుక్రవారం ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి వేదికగా పరిష్కారం : జీవీ

కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లో రెండు నెలల్లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించడం ఇది అక్షర విజయమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో రూ.62.60 లక్షలతో ప్రజలు కోరినట్లు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఆంధ్రజ్యోతి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ప్రజాసమస్యలు తీసుకెళ్లి పరిష్కరించగలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. వినుకొండలో ఆంధ్రజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు విని, పరిశీలించి రెండు నెలల్లో పరిష్కారించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించాలని కోరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తీరంలో సాగర్ కవచ్

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర మార్గం నుంచి అక్రమంగా మన దేశంలోకి చొరబాట్లను అడ్డుకోవడంతో పాటు అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు పోలీస్‌శాఖ చేపట్టిన సాగర్ కవచ్ విధులను మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో మెరైన్, స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించారు. చిన్నంగారిపట్టపుపాలెం తీరంలో మెరైన్ హోంగార్డ్ పోతురాజు ఆధ్వర్యంలో, కనపర్తి ప్రధాన కూడలి వద్ద పోలీసులు నిఘా విధులు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగులుప్పలపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు వద్ద గురువారం ముందు వెళుతున్న మోపెడ్ వాహనాన్ని కారు ఢీకొనడంతో అమ్మనబ్రోలుకు చెందిన పాతెం శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలయ్యారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రెడ్డినగర్ వద్ద రోడ్డు ప్రమాదం

● చీమకుర్తి వాసి దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం చీమలమర్రి సమీపంలో రెడ్డినగర్ వద్ద గల కర్నూల్‌రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకలు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ దాసరి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. రెడ్డినగర్ సమీపంలో కర్నూల్‌రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా వాహనాలు నడుపుతున్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న గ్రానైట్ కంటైనర్ కిందపడిన చీమకుర్తికి చెందిన ఏడుకొండలు(35) సంఘటనాస్థలంలో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. .గాయపడిన మరో వ్యక్తిని సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ప్రసాద్ తన వాహనంలో వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బాలబాలికల ఖోఖో శిక్షణ శిబిరం

ముండ్లమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల బాలికలకు వారం రోజుల పాటు జరిగే ఖోఖో శిక్షణను శుక్రవారం గ్రామ సర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరగనున్న పోటీలకు అవసరమైన శిక్షణను క్రీడాకారులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హెచ్‌ఎం మాధవీలత అధ్యక్షత వహించారు. ఆంధ్రా ఖోఖో అసోసియేషన్ మాజీ సెక్రటరీ మేకల సీతారామిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖోలో శిక్షణ ఇస్తామన్నారు. ముండ్లమూరులో శిక్షణకు ముందుకు రావటం పీడీ సోమశేఖరరెడ్డితో పాటు గ్రామస్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చక్క వెంకటేశ్వర్లు, శిరీషాకుమారి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఆవుల సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎల్‌పురం రహదారిపై ప్రమాదాల పరంపర

● ట్రాలీ క్యాబిన్ ఊడిపోయి కిందపడిన గ్రానైట్ రాళ్లు

చీమకుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించిన ప్రాంతంలో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. రామతీర్థం నుంచి ఆర్‌ఎల్‌పురంనకు వెళ్లే రహదారికి ఇరువైపులా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ రహదారి గుంతలమయమై అధ్వానస్థితికి చేరుకోవటంతో రవాణా కష్టతరంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఇక భారీ లోడుతో వెళ్తున్న గ్రానైట్ ట్రాలీలు గుంతల్లో పడి బోల్తా పడటం పరిపాటిగా మారింది. ఇటీవల ఇలాంటి సంఘటన చోటుచేసుకొని తృటిలో ప్రాణప్రమాదం తప్పిపోయింది. ఈ సంఘటన మరచిపోకముందే శుక్రవారం రాళ్ల లోడుతో వెళ్తున్న మరో ట్రాలీ గుంతల ప్రభావంతో క్యాబిన్ ఊడిపోయి ట్రాలీలో ఉన్న రాళ్లు రోడ్డుపై జారిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఇలా తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అయినా పాలకులు కళ్లు తెరచి రహదారికి మరమ్మతులను తక్షణమే నిర్వహించాలని ఈ ప్రాంతవాసులు, వాహనదారులు, పరిశ్రమవర్గాలు కోరుతున్నారు.

పంచాయతీ ఖజానాలో రూ.20కోట్లు..

ఆర్‌ఎల్‌పురం పంచాయతీ పరిధిలో గెలాక్సీ గ్రానైట్ క్వారీలు విస్తరించి ఉన్నాయి. వీటినుంచి ప్రభుత్వం రాయల్టీ వసూలు చేస్తుంది. ఈ వసూలు అయిన రాయల్టీ డబ్బుల్లో కొంతమేర పంచాయతీకి సెస్ రూపంలో సమకూరుతుంది. ఇలా జమ అయిన నిధులు రూ.20కోట్లకు పైగా పంచాయతీ ఖజానాలో ఏడాదిన్నరకు పైగా మూలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ పాలకవర్గం ఈ నిధులతో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేసింది. ఈపనుల్లో రామతీర్థం-ఆర్‌ఎల్‌పురం రహదారి శాశ్వతప్రాతిపదికపై పునర్నిర్మాణం కూడా ఒకటిగా ఉంది. అయినా ఈ పనుల నిర్వహణకు టెక్నికల్ అనుమతులు అధికారులు మంజూరు చేయలేదు. ఇప్పటికైనా వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ముప్పు రాకముందే అధికారులు అభివృద్ధి పనులు చేపట్టటానికి అనుమతులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రామతీర్థం-ఆర్‌ఎల్ పురంల మధ్య జారి పడిన గ్రానైట్ రాళ్లు

జూదరుల అరెస్ట్

చీమకుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవరపాలెం పరిసరప్రాంతాల్లోని పొలాల్లో గల పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.18,620 నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ దాసరి ప్రసాద్ తెలిపారు.

నేడు నూతన కోర్టు భవన సముదాయం ప్రారంభం

● హాజరుకానున్న హైకోర్టు జడ్జిలు

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరుగనున్నట్లు ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి తెలిపారు. ఉదయం 11.00 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, జస్టిస్ వై.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్.భారతిలు హాజరుకానున్నారన్నారు.

ఎస్సీ కాంప్లెక్స్ రూములకు దరఖాస్తులు చేసుకోవాలి

మార్కాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సెంటర్‌లోని ఎస్సీ కాంప్లెక్స్‌లోని 5 రూములకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను డిసెంబరు 10వ తేదీలోగా జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రగతి భవన్‌లోగల ప్రకాశం జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

అవీ..ఇవీ..

తైక్వాండోలో మెరిసిన సెయింట్‌ఆన్స్ విద్యార్థులు



క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు మెరిశారు. ఇటీవల కాకినాడలో 41వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ క్యొరుగీ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు పందరబోయిన భానురేఖ, ఎస్‌కే షాహిదా, సీహెచ్ అభిరామ్ వివిధ కేటగిరీల్లో స్వర్ణ, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈక్రమంలో శుక్రవారం కళాశాలలో సెక్రటరీ వనమారామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిశితంగా ప్రతి అర్జీ పరిశీలన



అర్జీలు స్వీకరిస్తున్న కూటమి నేతలు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీనీ ఎమ్మెల్యే కొండయ్య నిశితంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు పలువురు కూటమి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో నేతలు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు గంజి పురుషోత్తం, గోలి జగదీష్, గూడూరు శివరామప్రసాద్ ప్రజల నుంచి వచ్చిన 155 అర్జీలు స్వీకరించారు. వాటిల్లో నివేశన స్థలాలు 110, పింఛన్ సమస్యలు 25, ఇతర సమస్యలకు సంబంధించి మరో 20 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కారించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరలక్ష్మీ పలువురు కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలి

- ఈనెల 30న చీరాలలో రాష్ట్ర చేనేత సదస్సు
- పోస్టర్ ఆవిష్కరించిన పలు సంఘాల నేతలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చేనేత, పలు సంఘాల నేతలు

పేరాల(చీరాల), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించి నేతన్నలను ఆదుకోవాలని చేనేత, పలు సంఘాల నేతలు అన్నారు. ఈ నెల 30న రాష్ట్ర చేనేత సదస్సు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అందుకు సంబంధించి పేరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో దామర్ల శ్రీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.పరంజ్యోతి, వేమేశ్వరీ, ఆశీర్వాదం, చుండూరి వాసు, భాస్కరరావు, వెంకట్రావు లక్ష్మీనారాయణ, రవికుమార్ చేనేత ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువకట్ట రోడ్డు



కోసుకుపోయిన కాలువ కట్ట రోడ్డు

మేదరమెట్ల, నవంబరు 21 : జాతీయ రహదారి నుంచి కుర్రవానిపాలెంకు వెళ్లే కాలువ కట్ట రోడ్డు పలుచోట్ల ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గంలో కూరగాయలు తరలించే వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునే వీలు కూడాలేదు. ఏదో ఒక వాహనం వెనక్కు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతమంతా కూరగాయలు పండిస్తుంటారు. ఇక్కడ పండిన కూరగాయలను రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. జాతీయ రహదారి నుంచి పి.గుడిపాడు మీదుగా వెళ్లే ఈ రోడ్డు సాగర్ కాలువ నుంచి పి.గుడిపాడు చెరువుకు నీరు వెళ్లేచోట కాలువ కట్ట పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డులో తారురోడ్డు వేయకుండా మిగిలిన రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి రూ.17 లక్షలు మంజూరు చేశారు. దీనిలో భాగంగా దెబ్బతిన్న కాలువకట్టను కూడా బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం స్థలాలకు హక్కు నిర్ధారణకు నిర్వహించిన స్వామిత్వ సర్వేపై శనివారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరూధిని తెలిపారు. శనివారం ధేనువకొండ, 24న చక్రాయపాలెం, నన్నూరపాడులలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

మేదరమెట్ల, నవంబరు 21 : కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రసేన్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గుండె.. గుబిల్లు

- ఎస్టీ కుటుంబాలకు వర్తించని ఉచిత విద్యుత్ పథకం
- ఒక లైటు, ఒక ఫ్యానుకు వేలలో బిల్లు



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 33వ వార్డు వడ్డే పుల్లయ్య యానాది కాలనీ వాసులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. కాలనీలో సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. వారంతా ఇళ్లల్లో పాచి పనిచేసుకుని జీవించే యానాది కాలనీ వాసులు. రెక్కాడితేనే డొక్కాడని బడుగు బలహీనులు. ఈక్రమంలోనే వారికి ఇంట్లో ఒక లైటు, ఒక ఫ్యాను. కాలనీ అంతా కలుపుకుని మహా అయితే పది మందికి మాత్రమే టీవీలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ, ఎస్టీలకు ఉచిత 200 యూనిట్లు కాలనీ వాసులకు అమలు కావడం లేదు. దాదాపుగా ప్రతీ ఇంటికి బిల్లు చెల్లింపులకు సంబంధించి డిమాండ్ నోటీసులు ప్రతినెలా అందుతున్నాయి. ఇదిలా ఉంటే ఒక్కో ఇంటికి రూ.400 నుండి రూ.1500 వరకు బిల్లులు వస్తుండటం శోచనీయం. అసలే పూట గడవడం కష్టం. అటువంటిది బిల్లులు వేలకు వేలు వస్తుండటంతో నిరుపేద కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. సమస్య పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులను కలిసిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఇటీవల విద్యుత్ సిబ్బంది చాలాచోట్ల కటింగ్‌లు విధించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఒక్కొక్కరు రెండేసి వేలు కూడా బిల్లులు చెల్లించారు. విషయం తెలుసుకున్న ఆ సంఘం రాష్ట్ర నాయకులు బచ్చు రమణయ్య స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు. కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్యాస్ట్ సర్టిఫికెట్ ఇస్తే సరిచేస్తాం

వారు ఎస్టీలు అయినప్పటికీ, వివిధ కారణాలతో ఇంకా కులధ్రువీకరణ పత్రాలు మాకు ఇవ్వలేదు. ఇస్తే 200 యూనిట్లలోపు కరెంటు బిల్లు లేకుండా చూస్తాం.

పట్టణ ఏఈ శంకర్

రూ.2397 వేలు బిల్లు కట్టాను



పూట గడవక అవస్థ పడుతుంటే వేలకు వేలు బిల్లులు కట్టాలంటే స్థోమత లేదు. గతంలో బిల్లు సంగతి అవగాహన లేదు. ఇటీవల విద్యుత్ సిబ్బంది వచ్చి రూ.2397 కట్టాలని లేకుంటే ఇబ్బంది పడతారని హెచ్చరించడంతో అప్పుచేసి కట్టాను.

- చౌటూరి మహాలక్ష్మీ, స్థానికురాలు

ప్రభుత్వం ఉచితమంటోంది .. అధికారులు బిల్లుకట్టమంటున్నారు

కరెంట్ బిల్లు ఉచితమని ప్రభుత్వం చెబుతోంది. విద్యుత్ అధికారులు బిల్లు కట్ట మంటున్నారు. ఇళ్లల్లో పాచీ పని చేసుకుని గడుపుతున్నాను. అయినా సరే ప్రతీనెల బిల్లు కడుతున్నా. కానీ విపరీతంగా బిల్లు వస్తుంది. ఈ నెల కూడా రూ.1475 వచ్చింది. ఒక్క లైటు, ఫ్యానుకు అంత బిల్లు ఎందుకు కట్టాలో అర్థంకావడం లేదు.



- పోట్లేరు పోలమ్మ, స్థానికురాలు

అధికారులు మా గోడు పట్టించుకోవాలి

తినోతినకో గడుపుతుంటే కరెంట్ బిల్లులు మోత మోగుతు న్నాయి. మాకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదు. ప్రతీనెల బిల్లులు చెల్లిస్తున్నాము. ఆలస్యమైతే కోతలు విధిస్తున్నారు. అధికారులు మా గోడు పట్టించుకోవాలి.



- పుట్టాల నాగమ్మ, స్థానికురాలు

రేపటి నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు



షెడ్యూలను వివరిస్తున్న కార్యనిర్వాహకురాల ప్రతిమ

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో ఈ నెల 23 నుంచి 25 వరకు ఎస్‌జీఎఫ్. 69వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా జరుగ నున్న ఈ పోటీలకు సంబంధించిన వివరాలను శుక్రవారం కమిటీ చైర్మన్ చందలూరి గిరిజ అధ్యక్షతన పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో నిర్వాహక కార్యదర్శి, (ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి) కొండా ప్రతిమ వెల్లడించారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో బాల, బాలికల యోగాసన రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రెడిషనల్, ఆప్షనల్, ఆర్టిస్టిక్ ఈవెంట్లలో బాల బాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారన్నారు.

హాజరుకానున్న 450 మంది బాలబాలికలు

ఈ పోటీలలో పాల్గొనేందుకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది బాల, బాలికలు చందలూరు గ్రామం చేరుకోనున్నట్లు తెలి పారు. వీరితో పాటు జట్టు కోచ్‌లు, మేనేజర్లు, ఎన్ఐఎస్. క్వాలిఫైడ్ న్యాయ నిర్ణేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో పాటు గ్రామస్థులు స్థానిక ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల వ్యాయామో పాధ్యాయులు పోటీల నిర్వహణకు తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుండి పోటీలలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న బాలురకు స్థానిక ఉన్నత పాఠశాలలో, బాలికలకు గ్రామస్థుల సహకారంతో నివాస గృహాలలో వసతి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏక కాలంలో మూడు వేదికలపై పోటీలు

వివిధ విభాగాలకు సంబంధించి మూడు రోజులలో పూర్తికానున్న ఈ యోగాసన పోటీలు ఏకకాలంలో మూడు వేదికలపై ఆయా ఈవెంట్లను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ చందలూరి గిరిజతో పాటు అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సుబ్బయ్య, రావి శ్రీనివాసరావు, వసంత రఘుబాబు, వీ.అరుణ, ఏ.కొండలరావు పాల్గొన్నారు.

చందలూరు- గంగవరం రోడ్డు నిర్మాణానికి చర్యలు



రహదారిని తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామం నుంచి గంగవరం వరకు బీటీరోడ్డు పునర్నిర్మాణానికి పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు నిడివిని అంచనా వేసేందుకు అధికారులు శుక్రవారం ప్రాథమికంగా కొలతలు చేపట్టారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నూతనంగా బీటీ.రోడ్డు నిర్మించేందుకు రూ.2 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రెండు గ్రామాల మధ్య 3.7 కిలోమీటర్ల పొడవున 3.75 మీటర్ల వెడల్పుతో బీటీరోడ్డు నిర్మించనున్నట్లు పీఆర్ఏఈ హనుమంతరావు తెలిపారు.

ఖోఖో జిల్లా జట్టుకు అకాడమీ క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన ఎస్ఆర్ఆర్. అకాడమీ క్రీడాకారులు

పంగులూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా జట్టులో 9 మంది ఎస్ఆర్ఆర్ అకాడమి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు అకాడమి డైరక్టర్ ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈనెల 18న సింగరాయకొండ మండలం పాకలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఖోఖో జిల్లా బాలుర జట్టు ఎంపికలో పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.నవీన్, పి.వెంకటేశ్వర్లు, వి.సాయిచరణ్, షేక్ మహ్మద్ ఆషిఫ్‌అలీ, బి.తిరుమల, ఇ.గణేష్, డి.హేమంత్, జె.ఎల్లప్ప, ఎం.అక్షయ్‌కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో పి.ఎంకటేశ్వర్లు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతుండగా మిగిలిన ఎనిమిది మంది పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు.

సంక్షోభంలో ఉన్న పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలి

- గ్రానైట్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు మస్తానయ్య

బల్లికురవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలను ప్రభుత్వం తక్షణమే అదుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం వద్ద ఉన్న లలిత ఇండస్ట్రీస్‌లో ఫ్యాక్టరీల యజమానులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ పరిశ్రమలు నష్టాలబాటలో ఉన్నాయని, ఈ అంశాన్ని తాము ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా చేస్తామని హమీ ఇచ్చిన విషయాన్ని ఆయన తెలిపారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు వేచి చూసి మరో మారు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళతామన్నారు. ప్రకాశం జిల్లాకు, బాపట్ల జిల్లాకు ఒక్కో కట్టర్‌కు రూ.7 వేల వ్యత్యాసం ఉందని లోగ్రేడ్ రాయికి సీనరేజ్ తగ్గించాలని పలువురు యజమానులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొందరు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక ఫ్యాక్టరీలు మూత వేస్తున్నారని ప్రభుత్వం అదుకోకుంటే నష్టాలు మరింత తప్పవని వారు సమావేశంలో వాపోయారు. సమావేశంలో యజమానులు సుధాకర్, అప్పిరెడ్డి, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

హెల్మెట్ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన



హెల్మెట్లతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ బృందం

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డుభద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ వినోద్‌బాబు సూచించారు. మండలంలోని రేణంగివరం ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వినోద్‌బాబు నేతృత్వంలో పోలీసులు హెల్మెట్ ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. వాహనచోదకులకు హెల్మెట్ అవసరాన్ని తెలియచేస్తూ రోడ్డుభద్రతా నియమాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

చినగంజాం : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చిన గంజాం ఎస్.ఐ శీలం రమేష్ హెచ్చరించారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్.ఐ అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్ర తా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు చేయాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేటిలో దీపాలు వదులుతున్న మహిళలు

అద్దంకి : కార్తీక మాసం ముగింపులో భాగంగా శుక్రవారం పోలిస్వర్గం పూజలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినకాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించుకొని స్వామి వారిని దర్శించు కున్నారు. అరటి దొప్పలలో వత్తులు వెలిగించి గుండ్లకమ్మ నదిలో వదిలారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్థంభాల గుడి, కమఠేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి స్వామి వార్ల ను దర్శించుకున్నారు.

పంగులూరు : మండలంలోని రామకూరు కొండపై శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం ముగిసిన అనంతరం పోలిస్వర్గం సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ కొండపై కొలువుదీరిన శ్రీరామ లింగేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాగణపతి పూజ నిర్వహించిన అర్చకస్వాములు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు శాస్రోక్తంగా నిర్వహించారు. రాత్రి అన్న సంతర్పణ చేశారు.

చినగంజాం : కార్తీకమాసం ముగియడంతో శుక్రవారం వేకువజామున మహిళలు పోలిస్వర్గ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పోలిస్వర్గాన్ని పురస్కరించుకొని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, స్థానిక గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి, పలు శైవక్షేత్రాల వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం వ్రతం ఆచరించిన మహిళలు అంతా కార్తీకమాసం ముగింపురోజున అరటి బోదెలలో దీపాలు వెలిగించి వాటిని కొలనులు, నదులలో వదలడం సాంప్రదాయంగా వస్తోంది. భారీ సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో వెలిగించి వదిలిన దీపాలతో బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరు దీపకాంతులతో నిండింది. పోలిస్వర్గ కథను అర్చకస్వాములు భక్తులకు విశదీకరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని శైవ క్షేత్రాల్లో భక్తులు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.



అద్దంకిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 30 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో అందుకు సంబంధించి నాయకులతో కలిసి విరాళాలు సేకరించారు. కార్మికుల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తున్న యూనియన్ సభలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, బాబురావు, ఇమ్మానియేల్, సామ్యేల్, సాగర్, సింగయ్య, కోటేశ్వరమ్మ, మరియమ్మ, ఆదిలక్ష్మీ, రాజేశ్వరీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

మండల అకడమిక్‌ఫోరం ఏర్పాటు



మాట్లాడుతున్న బాలప్రసాద్

కారంచేడు(పర్చూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దీనిలో భాగంగా మండల అకడమిక్ ఫోరంలను ఏర్పాటు చేసినట్లు ఫోరం అధ్యక్షుడు బొప్పూడి బాలప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పరిశీలించారు. కరదీపికలు, సమగ్ర అభివృద్ధి పత్రాలు, మార్కులు, గ్రేడులపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్వర్ణ, కుంకలమర్రు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.వీసుబ్బారావు, బి.బాలప్రసాద్, సబ్జెక్ట్ నిపుణులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ ఈవో

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు21(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం హైస్కూల్ ను డిప్యూటీ డీఈవో గంగాధర్ శుక్రవారం సందర్శించారు.వార్షిక తనిఖీలలో భాగంగా ఆ య న హైస్కూల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా స్కూల్ లోని విద్యార్థుల హాజరుపట్టీని,స్కూల్ లో విద్యార్థులకు గల వసతులను మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు.ఉపాధ్యాయులతో మాట్లాడారు.10 తరగతి పరీక్షలలో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అ య్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అనంతరం సూరవరపుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు **నెల్లూరు** జిల్లా వార్తలు

శనివారం 22 నవంబరు 2025

మీ కనెక్షన్.. మీ ఏజెన్సీ!

● నచ్చిన డీలర్‌కు గ్యాస్ సర్వీసు మార్చుకునే అవకాశం



గ్యాస్ సంస్థ	కనెక్షన్లు
హెచ్‌పీసీఎల్	2,38,927
బీపీసీఎల్	1,99,831
ఐఓసీఎల్	3,48,725
మొత్తం	7,87,483

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ కనెక్షన్‌లోనూ పోర్టబిలిటీ విధానం అమలులోకి రానుంది. ఈ విధానంలో ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడ రేషన్ సరుకులు తీసుకోవచ్చు. అలాగే గ్యాస్ కంపెనీ సేవలు నచ్చకపోతే మరో కంపెనీకి మారే అవకాశాన్ని త్వరలో ప్రభుత్వం కల్పించనుంది. గ్యాస్ సిలిండర్ ధర ఒక్కటే కావటంతో పోర్టబిలిటీ విధానానికి ఇంధన నియంత్రణ సంస్థ సంకల్పించింది. వినియోగదారులకు ఈ విధానం ఉపయుక్తం కానుంది. ఒకే కంపెనీ పరిధిలో డీలరును మార్చుకునే వెసులుబాటును 2013లోనే కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం గ్యాస్ కంపెనీనే మార్చుకునే అవకాశం కల్పిస్తోందనీ, త్వరలో ఈ విధానం అమలులోకి వస్తుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పారు. కాగా, జిల్లాలో 78,74,83 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, మూడు ప్రధాన కంపెనీలకు 52 ఏజెన్సీలు ఉన్నాయి.

కూలి తీసుకుని.. గుట్టుగా జారుకుని!

- ‘ఉపాధి’ పథకంలో అక్రమాలకు బ్రేక్
- ఈకేవైసీ తప్పనిసరి చేసిన కేంద్రం
- 4,90,910 మందికి 73.54 శాతం పూర్తి
- ప్రక్రియకు దూరంగా 1,31,718 మంది
- అక్రమాలు బయటపడతాయనే..

వివరాలు 8లో..



గతంకన్నా రెట్టింపు సాయం

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి
- మత్స్యకారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు
- ఉత్సాహంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

వివరాలు 8లో..



మత్స్యకారులకు పడవ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, అజీజ్ తదితరులు

ఆ ఇళ్లు పనికిరావ్!

పేదల ఇళ్ల మాటున జరిగిన అవినీతి, అక్రమాలు సాక్షాలతో సహా బయటపడుతున్నాయి. ఇప్పటికే విజిలెన్స్, హౌసింగ్ శాఖ అంతర్గత విచారణలోనూ భారీగా అవినీతి జరిగినట్లు తేలగా, తాజాగా థర్డ్ పార్టీ విచారణలోనూ భారీ కుంభకోణం జరిగినట్లు వెలుగు చూస్తోంది. ఎమ్మెల్యేల మొదలు సామాన్యుల వరకూ ఫిర్యాదులు అందుతుండటంతో గత ప్రభుత్వంలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్ల నాణ్యతను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పనిని ఓ థర్డ్ పార్టీ ఏజెన్సీకు అప్పగించింది. గడిచిన మూడు వారాలుగా పేదల లేఅవుట్లలో నిర్మించిన ఇళ్ల నాణ్యతను ఈ థర్డ్ పార్టీ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. 20 వేలకుపైగా ఇళ్లను పరిశీలించాల్సి ఉండగా ఇప్పటివరకూ 14 వేల ఇళ్ల పరిశీలన పూర్తయినట్లు తెలుస్తోంది.



టీపీ గూడూరు మండలం వరిగొండ గ్రామం ఎస్టీ కాలనీలోని ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న థర్డ్ పార్టీ ఇంజనీర్లు

- కొన్నింటిని తొలగించి పునఃనిర్మించాల్సిందే!
- మరికొన్నింటి నిర్మాణాలను సరిచేయాలి
- థర్డ్ పార్టీ నిర్ధారణలో తేలుతున్న ఇళ్ల నాణ్యత
- కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారుల దోపిడీ ఫలితం
- తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఎత్తుగడలు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పరిశీలించిన 14 వేల ఇళ్లల్లో సుమారు 5 వేల ఇళ్లు నాసిరకంగా నిర్మించారని థర్డ్ పార్టీ నిర్ధారించినట్లు సమాచారం. ఇందులో కొన్ని ఇళ్లను టెక్నాలజీ ఉపయోగించి సరిచేసుకునేందుకు అవకాశం ఉందని, మరికొన్నింటిని పూర్తిగా నేలమట్టం చేసి మళ్లీ నిర్మించాలని సూచించినట్లు తెలుస్తోంది. తొమ్మిది పిల్లర్లతో ఇళ్లు నిర్మించాల్సి ఉండగా, కొన్నిచోట్ల నాలుగు పిల్లర్లు మాత్రమే వేసి ఉన్నారు. పిల్లర్ లోతు ఆరు అడుగులు ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల మూడు అడుగులకు మించి లేదని గుర్తించారు. ఇక సిమెంటు, స్టీలు వాడకం కూడా తక్కువగా ఉందని, ఇటువంటి ఇళ్లు ఎక్కువ కాలం నిలవవని థర్డ్ పార్టీ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు హౌసింగ్ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రం వ్యాప్తంగా జరుగుతున్న క్వాలిటీ పరీక్షల్లో ఎక్కువ అక్రమాలు నెల్లూరు జిల్లాలో బయటపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు, కాంట్రాక్టర్లు థర్డ్ పార్టీను కూడా మేనేజ్ చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ ఇళ్లు బాగున్నాయని నివేదిక ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, కావలి డివిజన్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో హౌసింగ్ ఎండీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌బాబు జిల్లాపై దృష్టి సారించారు. ఈ క్వాలిటీ పరీక్షలను పరిశీలించేందుకు శుక్రవారం నెల్లూరుకు వచ్చేందుకు షెడ్యూల్ ఖరారు చేయగా, చివరి నిమిషంలో వాయిదా పడింది. వచ్చే వారం ఆయన జిల్లాకు వచ్చే అవకాశముందని హౌసింగ్ వర్గాలు చెబుతున్నాయి.

● తప్పించుకునేందుకు ఎత్తుగడలు

గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల మాటున కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఆప్షన్-3 పేరుతో ఇష్టానుసారం కాంట్రాక్టర్లకు ఇళ్లను అప్పగించగా, అత్యంత నాసిరకంగా నిర్మించారు. మాకు పోయేదేముందిలే.. అన్న ధోరణిలో అధికారులు వారితో కుమ్మక్కయ్యారు. ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించే బరితెగింపు చర్యలకు జిల్లాలో హౌసింగ్ అధికారులు పాల్పడ్డారు. విజిలెన్స్ విచారణలో ఈ కుంభకోణం బయటపడింది. ఇప్పుడు ఇళ్ల నాణ్యత కూడా అత్యంత నాసిరకంగా ఉందని తేలుతుండడం నాడు జరిగిన దోపిడీ స్థాయిని ఎత్తి చూపుతోంది. అయితే ఈ ప్రభుత్వంలో కూడా గత అక్రమాలను అధికారులు తొక్కిపెట్టి ఇటీవల వరకూ బిల్లులు పాస్ చేయడం గమనార్హం. పేదల ఇళ్ల విషయంలో అక్రమాలకు పాల్పడ్డ అనేక మంది హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో కాంట్రాక్టర్ల చేత పనులు చేయించడమా లేదా రికవరీ చేయడమా అన్నది కూడా ప్రభుత్వ స్థాయిలో ఆలోచన జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు, అధికారులు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎలాగైనా బయటపడాలని తమ బలాన్నంతా ఉపయోగిస్తున్నారు.



నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసానికి వేళాయె!

- నేటితో నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి
- వేగంగా అడుగులు వేస్తున్న కార్పొరేటర్లు
- సోమవారం నోటీసులు ఇచ్చే అవకాశం?

నెల్లూరు (సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్‌గా పోట్లూరి స్రవంతి బాధ్యతలు స్వీకరించి శనివారానికి నాలుగేళ్లు పూర్తికానుంది. దీంతో ఆమెపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న కార్పొరేటర్లు కలెక్టర్, ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లాకు నోటీసు అందచేసేందుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. శనివారానికి నాలుగేళ్లు పదవీ కాలం పూర్తి చేసుకున్న ఆమె ఆ మరుసటి రోజు ఆదివారం కావడంతో సోమవారం కార్పొరేటర్లంతా లిఖిత పూర్వక అవిశ్వాస నోటీసును అందచేయనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం చర్చ మొదలైంది. ఎస్టీ జనరల్ కింద స్రవంతి నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్నారు. ఆమెపై అవిశ్వాసం పెడితే అధికార టీడీపీకే అత్యధిక కార్పొరేట్ స్థానాలు ఉండటంతో సులువుగా ఆమెను ఆ పదవి నుంచి దించే అవకాశాలున్నాయి. ఆ తరువాత ఆ స్థానంలో మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్నది అధికార పార్టీలో ఆసక్తిగా మారింది. ఈ విషయమై అటు మంత్రి నారాయణ, ఇటు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు లోతైన అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే డిప్యూటీ మేయర్లలో ఒకరికి ఇన్‌చార్జి మేయర్‌గా అవకాశం కల్పిస్తారన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

పొట్టేపాళెం వంతెన నిర్మాణానికి టెక్నికల్ అనుమతులు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ శుక్రవారం టెక్నికల్ అనుమతులు మంజూరు చేసింది. సోమవారం నుంచి టెండర్లు ఆహ్వానించేలా జిల్లా అధికారులకు అనుమతి ఇచ్చింది. రూ.4 కోట్లతో బ్రిడ్జి పనులు మొదు కానున్నాయి. ఏడాదిలోపు పనులు పూర్తి చేసేలా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. నెల్లూరు-తాటిపర్తిరోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గత నెలలో పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అయితే ఆ ఉత్తర్వులలో రోడ్డు అభివృద్ధి అన్నారు తప్ప బ్రిడ్జి నిర్మాణం గురించి ప్రస్తావించలేదు. దీంతో పొట్టేపాళెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణంపై సందిగ్ధం నెలకొంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బ్రిడ్జి నిర్మాణానికి టెక్నికల్ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



ఆశ చూపి.. నిలువునా దోచేసి..!

బ్యాంకు ఖాతాల నుంచి రూ.22 లక్షలు స్వాహా

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడంలేదు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశను ఆసరా చేసుకున్న ఆర్థిక నేరగాళ్లు సులువుగా మోసం చేసి వారి కష్టార్జితాన్ని స్వాహా చేస్తున్నారు. తాజాగా దుత్తలూరు మండలంలోని ఓ గ్రామంలో జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో టెలిగ్రామ్ యాప్ ద్వారా వర్క్ ఫ్రం హోం చేస్తే నగదు సంపాదించవచ్చని ఆశపడ్డాడు. ఆ యాప్‌లో నిత్య అనే యువతి పరిచయం కావడంతో ఆమె మాటలు నమ్మి వ్యాపార నిమిత్తం ఈ ఏడాది సెప్టెంబరు 23 నుంచి నవంబరు 7వ తేదీ వరకు సంస్థ రిజిస్ట్రేషన్, ఇతరత్రా పేర్లతో విడతల వారీగా వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.22 లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా అవతలివైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయాయని గ్రహించి శుక్రవారం దుత్తలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జడ్పీ సీఈవోగా శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సీఈవోగా శ్రీధర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. ఇదివరకు సీఈవోగా ఉన్న విద్యారమ ఈ ఏడాది జూన్‌లో బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా, డిప్యూటీ సీఈవో మోహన్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డీపీవోగా పని చేస్తున్న శ్రీధర్‌రెడ్డిని జడ్పీ సీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తహసీల్దార్లు, డీటీలకు బదిలీ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలువురు తహసీల్దార్లను, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలువాయి తహసీల్దారుగా కృష్ణారెడ్డిని, కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ డీఏవోను జలదంకికి డిప్యూటేషన్ పద్ధతిలో తహసీల్దారుగా నియమించారు. చేజర్ల తహసీల్దారు బి.మురళిని డిప్యుటేషన్‌పై ఇందుకూరుపేటకు బదిలీ చేశారు. అదేవిధంగా నలుగురు డీటీలను, ఒక సీనియర్ అసిస్టెంట్‌కూ స్థానభ్రంశం కల్పించారు.

పెన్నాడెల్టాకు నీటి సరఫరా పెంపు


అనంతసాగరం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి పెన్నాడెల్టాకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును పెంచారు. శుక్రవారం 6,998 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టులో 74.499 టీఎంసీల నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 300, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కులు సరఫరా చేస్తుండగా 8గేటు ఎత్తి మరో 5వేల క్యూసెక్కుల నీటిని పెన్నాకు విడుదల చేశారు.

అదంతా కాదండీ.. మేం చెప్పినోళ్లకే ఇవ్వండి!

● యూరియా పంపిణీపై నేతల తీరిది ● తలలు పట్టుకుంటున్న వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది

‘అవన్నీ మాకనవసరమండీ. మేం చెప్పినోళ్లకు, సిఫార్సు చేసినోళ్లకు మాత్రం యూరియా బస్తాలు ఇవ్వాలి. మీవల్ల కాదంటే చెప్పండి. ఎవరితో ఎలా చెప్పించుకోవాలో మాకు తెలుసు. అక్కడే తేల్చుకుంటాం.’

\- గ్రామాల్లో రాజకీయ నాయకుల వరస ఇది.



యూరియా పంపిణీ విషయం లో వీరి ఒత్తిళ్లు తట్టుకోలేక వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రబీ సీజన్ మొదలు కావడంతో జిల్లావ్యాప్తంగా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే, బహిరంగ మార్కెట్లో నిర్ణీత ధరకు యూరియా లభించడం లేదు. వ్యవసాయ శాఖ రైతుసేవాకేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎమ్మార్పీకే యూరియా అందించే ఏర్పాట్లు చేసింది. రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేసి ఎకరానికి 3 బస్తాలు చొప్పున మూడు దఫాలుగా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించి పంపిణీ మొదలు పెట్టారు. ఈ విధానంలో యూరియా పంపిణీ చేయాల్సి ఉండగా ఇందులో కూటమి పార్టీల నాయకుల జోక్యం వ్యవసాయ శాఖ సిబ్బందికి తలనొప్పిగా మారింది. తాము సూచించిన వారికే యూరియా ఇవ్వాలని గ్రామస్థాయి నాయకులు ఒత్తిడి చేస్తుండటంతో వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. అంతేగాక తమ వ్యతిరేకులకు బస్తాలు ఇస్తే ఊరుకునేది లేదనే ధోరణిలో పలువురు నేతలు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిఫారసు ఉన్నవారికే ప్రాధాన్యత కింద యూరియా బస్తాలు అందుతుండటంతో రైతులు తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

● జిల్లావ్యాప్తంగా బ్లాక్‌మార్కెట్లో యూరియా విక్రయాలు జోరందుకున్నాయి. ఎమ్మార్పీకి యూరియా కావా లంటే తాము ఇచ్చిన క్రిమిసంహారక మందులు లేదా జింక్‌సల్ఫేట్ వంటి సూక్ష్మపోషకాలు తీసుకోవాల్సిందేనని వ్యాపారులు మెలిక పెడుతున్నారు. ఒక్కో బస్తా రూ.100లకుపైగా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యవసాయ శాఖ ఎన్ని దాడులు చేసినా ఈ బ్లాక్‌మార్కెట్ వ్యాపారం మాత్రం ఆగడం లేదు.

\- జలదంకి (ఆంధ్రజ్యోతి)



జలదంకి : పొలంలో చల్లేందుకు డీఏపీ, యూరియా మిశ్రమాన్ని బస్తాలలో నింపుతున్న రైతులు

సోలార్‌కు నీళ్లొదిలారు!



- మూలకు చేరిన సోలార్ నీటి పథకాలు
- రూ. 5.24 కోట్ల ప్రజాధనం వృథా
- బాగుచేయించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ నిర్లక్ష్యం

దేశవ్యాప్తంగా సోలార్ వినియోగం ఎక్కువైంది. ఇంటింటా సౌర వ్యవస్థను తీసుకు రావాలన్న లక్ష్యంతో పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటినుంచో ఉన్న వ్యవస్థను నీరుగార్చుతుండటం విమర్శలకు తావిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన సోలార్ మంచినీటి సరఫరా విధానాన్ని నిర్లక్ష్యం చేయడమే ఇందుకు నిదర్శనం.

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉమ్మడిగా ఉన్నప్పుడు 2,622 హ్యాబిటేషన్లు ఉండగా మొదటి దశలో భాగంగా 107 చోట్ల మంచినీటి సమస్య పరిష్కరించేందుకు ప్రయోగాత్మకంగా సోలార్ డీఎల్ పంపుల విధానం తీసుకొచ్చారు. సంగం, బోగోలు, కొండాపురం, వింజమూరు, నాయుడుపేట, విడవలూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, చిట్టమూరు, తదితర మండలాల పరిధిలోని హ్యాబిటేషన్లలో ఏర్పాటు చేశారు.

● రూ.5.24 కోట్లు మంజూరు

ఓ ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించి ఒక్కొక్క సోలార్ పంపు సెట్‌కు రూ.5 లక్షల చొప్పున రూ.5.24 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు 107 హ్యాబిటేషన్లలో ఖర్చు పెట్టారు. సంగం మండలం పడమటిపాళెం పంచాయతీలోని పల్లిపాళెం, వీర్లగుడిపాడులో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేశారు. ఈ రెండు పథకాలు కొంతకాలం బాగా పని చేసి ప్రజల తాగునీటి అవసరాలు తీరాయి. రెండేళ్లు సంస్థ పర్యవేక్షణలో జరిగాయి. గడువు తీరిన తరువాత ఆ సంస్థ తాగునీటి గ్రామీణాభివృద్ధి సంస్థకు అప్పగించారు.

● చోద్యం చూస్తున్న అధికారులు

ఆ తరువాత బోర్లు మరమ్మతులకు గురవడంతో మూలనపడ్డాయి. వీటిని బాగు చేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదు. పలు గ్రామాల్లో సోలార్ పలకలు వినియోగంలో లేవు, చిన్నపాటి లోపాలనూ పట్టించుకోకపోవడంతో సోలార్ నీటి పథకాలు శాశ్వతంగా మూలన పడేశారు. ఇదే పరిస్థితి జిల్లా మొత్తం నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో 99 శాతం సోలార్ పంపుసెట్లు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 660



హాకీ టోర్నమెంట్‌లో కందుకూరు విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్ 14 హాకీ టోర్నమెంట్‌లో కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచారని హెచ్ఎం ఎం నరసింహమూర్తి, పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, మెండా నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు త్వరలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

చల్లాయానాదులం.. చల్లగా చూడండయ్యా!

- ఉన్నచోటే పక్కా ఇళ్ళు నిర్మించాలి
- పూరి గుడెసెల్లో జీవనం దుర్భరం
- ఆదుకోవాలంటున్న చల్లాయానాదులు

జలదంకి, నవంబర్21 (ఆంధ్రజ్యోతి): 'సారూ.. మేమూ మనుషులమే... మా బాగోగుల గురించి కాస్త పట్టించుకోండయ్యా' అని వేడుకుంటున్నారు చల్లాయానాదులు. మండల కేంద్రమైన జలదంకి సమీపంలోని దొరువుకట్ట, కాలువగట్టుపై పూరిగుడెసెల్లో వీరు దుర్భరంగా జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామంలో 70కి పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. చేపల వేటపై ఆధారపడి వీరు జీవిస్తున్నారు. సీజన్లో వ్యవసాయ పనులకు వెళతారు. కూలి డబ్బుతో పొట్టనింపుకొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి తలరాతలు ఏమాత్రం మారడం లేదు. తాటాకు గుడెసెల్లో నేటికీ రెండుమూడు జంటలు కాపురాలుంటున్నాయి. కట్టెలపొయ్యిపై ఆరుబయటే వంట. వీరికున్న ఆస్తులు.. ఆధార్, రేషన్ కార్డులే. వర్షా కాలంలో ఆరుబయట వంట చేసు కోలేక ఖాళీ కడుపులతో బతుకు వెళ్ళదీస్తున్నారు. గుడెసెలో కట్టెలపొయ్యిపై వంట చేసుకుంటే గుడెసెకు ఎక్కడ నిప్పంటుకుందోననే భయం. కనీసం వీరి నివాసాల వద్ద అంతర్గత మట్టిరోడ్లు కూడా వేయలేదు. కనీసం తలదాచుకునేందుకు పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని వీరు అధికారులు, పాలకులకు విన్నవించుకుంటున్నారు.



ఎన్నికలప్పుడే మా ముఖాలు చూస్తారు



నాకు 60 ఏళ్ళకు పైనే ఉంటాయి. ఇక్కడే పుట్టి పెరిగాను. బిడ్డలకు పెళ్ళిళ్ల చేశా. మాతో పాటు మా ఇద్దరు కొడుకులు, కూతుళ్ళు ఒకే గుడెసెలో ఉంటున్నామయ్యా. ఎన్నికలప్పుడు మాత్రమే ఆసాములు, ఆఫీసర్లు మా ముఖాలు చూడడానికి వస్తారు. మా బాదలు వాళ్ళకి చెప్పుకుంటే వింటారు. చేస్తామని చెప్పి పోతారంతే. మేమున్న చోటే మాకు స్లాబు ఇండ్లు కట్టిస్తే దాంట్లో తలదాచుకుని పనీబాట చేసుకుని పొట్టబోసుకుంటామయ్యా.

- పొట్లూరి చిన్నమ్మ

మేమున్న చోటే ఇండ్లు కట్టించండయ్యా



అయ్యా.. మాపెద్దోళ్ల కాలం నుండి దొరువుకట్ట కాడే ఉంటున్నాం. ఇక్కడైతే ఆసాముల దగ్గర పనీపాట చేసుకుని పొట్టపోసుకుంటాం. అందుకోసం మాకు ఇక్కడే పక్కాఇండ్లు కట్టించి కాస్త నీడను కల్పించండయ్యా. ఊరికి దూరంగా స్థలాలు ఇస్తే అక్కడ మేము ఎలా బతకాలయ్యా.

- కుందుకూరు చెంచమ్మ

ఈ గుడెసెలోనే మూడు జంటలముంటున్నాం

ఈ చిన్న తాటాకు గుడెసెలో బార్యాభర్తలం, పిల్లలు, మా తలిదండ్రులు, మా అన్నవదినలు, వారి పిల్లలు కలసి మొత్తం 10మంది ఉంటున్నాం. అందరం ఈ గుడెసెలో ఉండాలంటే చాలా ఇరుకుగా ఉంది. వర్షాకాలంలో చాలా ఇబ్బంది. కాళ్ళుముడుచుకుని పడుకోవాలన్నా స్థలం సరిపోవడం లేదు. పక్కా ఇళ్ళు కట్టించి మమ్మల్ని ఆదుకోండయ్యా.

- పొట్లూరు కొండయ్య, సుబాషిణి



న్యూస్ బాక్స్

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇంద్రాణి

కందుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టరు ఇంద్రాణి నియమితులయ్యారు. ఈమేరకు వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా కందుకూరు ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్న డాక్టరు ఇంద్రాణి కరోనా సమయంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. కొద్దినెలల క్రితం ఆత్మకూరు ఏరియా ఆసుపత్రికి బదిలీ అయిన ఇంద్రాణి తిరిగి కందుకూరులో నాలుగురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టరు శకుంతల తనను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని చేసిన విజ్ఞప్తితో సూపరింటెండెంట్ బాధ్యతలు ఇంద్రాణికి అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకోవాలి

అల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పు శ్రీనివాసులు అన్నారు. రామకృష్ణ డిగ్రీ, పీజీ విద్యార్థులు శనివారం నిర్వహించిన ఎన్‌ఎస్ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని వెలికితీసేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌సింగ్, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

భవిష్యత్తు సోషలిజానిదే

కావలి (టౌన్)నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు సోషలిజానిదేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం మోహనరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకులు ఎస్ వెంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోషలిజం - విశిష్టత అనే అంశంపై ఆయన మాట్లాడారు. న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్ట్ మందాని ఎన్నికవడం శుభ పరిణామమన్నారు. కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య, సభ్యులు కృష్ణయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.

వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి : ఎంఈవో



రికార్డులు పరిశీలిస్తున్న ఆనందరావు

కొండాపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర వివరాలను ఆన్‌లైన్లో ఖచ్చితంగా నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గానుగపెంట మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులతో పాటు ఎస్ ఏ-1 మార్కుల రికార్డులను పరిశీలించారు . ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఏడీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. దగదర్తి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, స్థానికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరుపై డాక్టర్ అఖిలతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో లెప్రసీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. లెప్రసీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కొండారెడ్డి, ఆరోగ్య సిబ్బంది కల్పన, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇంటింట సర్వేలో జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి

ప్రజా సమస్యల పరిష్కారానికి

చిత్తశుద్ధితో కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు

లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్ (పిజిఆర్ఎస్) కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి అనేక తప్పిదాలు జరిగాయని, వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం మరలా రీసర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే తహసీల్దార్, సబ్ కలెక్టర్ల దృష్టికి తెచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.



లింగసముంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్నఎమ్మెల్యే నాగేశ్వరరావు

సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు

స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు గతంలో దాతలు 7.23 ఎకరాల భూమి దానం చేశారని, దీంతో అందులో హైస్కూల్ నిర్మించారని, అయితే ప్రస్తుతం 5 ఎకరాలు మాత్రమే ఉందని, కొలతలు వేసి మిగిలిన 2.23 ఎకరాలు అప్పగించాలని ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు అర్జీ ఇచ్చారు. అలాగే మరో 109 మంది అర్జీలు ఇవ్వగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్‌వివి బాలసుబ్రహ్మణ్యం, సీఐ మంగారావు, ఎస్సై నారాయణ, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాధం, ఆర్ఐ ఎం రమణయ్య అన్ని శాఖల అధికారులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలో 24 గంటలు విద్యుత్ సరఫరా

వలేటివారిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో త్వరలో 24 గంటలు విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆర్‌డిఎస్ఎస్ పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో లోఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. మండలంలోని పోకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఇకపై నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కానున్నట్లు తెలిపారు. బడేవారిపాలెం ఫీడర్ పరధిలోని గ్రామాల్లో ఈ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ పథకం కింద పోలినేనిచెరువు, చుండి గరుకుపాలెం, వీరన్నపాలెం, కాకర్లపాలెం పెదఅమ్మపాలెం గ్రామాల్లో పనులు పూర్తయినట్లు తెలిపారు. దీంతో గృహావసరాలకే కాకుండా వ్యవసాయ బోర్లకు కూడా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, వీరయ్య, ఏఈ మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డు విస్తరణలో భాగంగా లైన్‌వర్క్ ఉన్నందున శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11కేవీ సీటీఆర్ఐ ఫీడర్, 11కేవీ తహసీల్దార్ కార్యాలయం ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల ప్రజలంతా అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

పచ్చదనంతోనే పచ్చని జీవితాలు

కావలి (టౌన్) నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చదనంతోనే జీవితాలు పచ్చగా ఉంటాయని జవహర్‌భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవ రోజు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ ప్రాంతంలో ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థి దశనుంచే సామాజిక సేవాదృక్పథం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో జేబీ స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు ఆర్ మాల్యాద్రి, లైబ్రేరియన్ వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, విశ్రాంత హిందీ అధ్యాపకుడు భాస్కర్‌రావు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



గిరిజన కాలనీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు

డంపింగ్ యార్డుకు దారి చూపండి!

వలేటవారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో చెత్తసంపద కేంద్రానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో గ్రీన్ అంబాసీడర్లు గ్రామంలోని చెత్తను ప్రధాన రహదారి పక్కన వేసి నిప్పుపెడుతున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తసంపద కేంద్రాన్ని ప్రధాన రహదారికి అర కిలో మీటరు దూరంలో లక్షలు వెచ్చించి నిర్మించారు. అయితే రోడ్డు సౌకర్యం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది. కాగా, చెత్తను సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేసి విక్రయించగా వచ్చిన ఆదాయంతో పంచాయతీల్లో అబివృద్ధి పనులు చేపట్టాలనే ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది.



ఉప్పలపాడులో డంపింగ్‌యార్డుకు వెళ్లే దారి ఇదే..!

చెత్త రహిత గ్రామాలే లక్ష్యం

- డీఎల్‌పీవో కృష్ణమోహన్
- పచ్చదనం - పరిశుభ్రతపై పోలినేనిపాళెంలో శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో శుక్రవారం పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరితరాయబారులు గ్రామంలోని చెత్తను సంపద కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రానికి తరలించిన చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి సేంద్రియ ఎరువులను తయారుచేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించి, వచ్చిన ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రీన్ అంబాసీడర్లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, సర్పంచ్ అనుమోల అమరేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలినేనిపాళెంలో గ్రీన్ అంబాసీడర్లను సన్మానిస్తున్న డీఎల్‌పీవో కృష్ణమోహన్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కావలి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలం చలంచర్ల గ్రామ పంచాయతీలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లకు స్థానిక సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి థీమ్-5, క్లీన్ విలేజ్ - గ్రీన్ విలేజ్‌పై శిక్షణ ఇచ్చారు. తడిచెత్త, పొడి చెత్తలను వేరువేరుగా అందించాలని సూచించారు. చెత్తసేకరణ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, సీఆర్పీ లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బిట్రగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్ర మం నిర్వహించారు. బోగోలు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం, అరుంధతివాడ, కప్పరాళతిప్ప, చెంచులక్ష్మీపురం గ్రామాల్లో చెత్తను తొలగించారు. చెంచులక్ష్మీపురం ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన స్థానికులు చెత్త వేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులకు ఎంపీడీవో స్పందించారు. ఇష్టానుసారంగా రోడ్లపై చెత్త వేస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ప్రజ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ విస్తరణాధికారి వేణుగోపాల్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిట్రగుంట : చెత్త తొలగింపజేస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



కొద్దిపాటి వర్షానికే బురదమయం

కావలి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొద్దిపాటి వర్షానికే శివారు ప్రాంతంలోని రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికే టీకేనగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, టీచర్స్ కాలనీ, వైకుంఠపురం, గాయిత్రీనగర్ తదితర ప్రాంతాలన్నీ బురదమయమయ్యాయి. కనీసం కచ్చా (మట్టి) రోడ్డు కూడా లేకపోవడంతో వాన నీరు వెళ్లేందుకు మార్గంలేక గుంతల్లోనే నీరు నిల్వ ఉంటోంది. కాలువలు లేనందున నివాసాల ముందు బురదగా మారి రాక పోకలకు ఇబ్బందికరంగా మారిందని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. తమ కాలనీల్లో కనీస వసతులు లేవని, అధికారులు, పాలకులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

కావలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విపత్తు నిర్వహణపై శుక్రవారం స్థానిక పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందరరాజు ప్రమాదాలలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స, ఆసుపత్రికి సురక్షితంగా తరలించటంపై అవగాహన కల్పించారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు, జూనియర్ రెడ్‌క్రాస్ సలహాదారుడు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జూనియర్ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరి సేవ, ఆరోగ్యం, అంతర్జాతీయ స్నేహంపై శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు, విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ కేబీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జూనియర్ రెడ్‌క్రాస్ బాధ్యులు





ధ్వంసం చేసిన జాతీయ రహదారి డ్రెయిన్

హైవేపై డ్రైనేజీల ధ్వంసం

కలిగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహ దారి 167బీజీ విస్తరణలో భాగంగా గత 20 రోజుల నుండి పట్టణంలో రహదారి వెంబడి డ్రెయిన్‌ల నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం రోడ్డు పనులను పరిశీలించారు. కొలతల్లో తేడాలు ఉండటం గుర్తించి, పనులు సరిగా చేయాలని లేకపోతే ఆపివేయా లంటూ అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా రోడ్డు పనులు జరగడంతో, పలువురు నాయకులు అర్ధరాత్రి జేసీబీ యంత్రా లతో డ్రైనేజీ కాలువలను పగులగొట్టించారు. శుక్రవారం ఉదయం హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోని బేకరీ వద్ద పాత సిమెంటు రోడ్డుకు నిర్మించి న డ్రెయిన్ పగులకొట్టడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విష యమై ఎన్‌హెచ్ డీఈ నాగిరెడ్డిని వివరణ కోరగా, రాత్రివేళల్లో అక్రమంగా డ్రెయిన్‌లను ధ్వంసం చేసినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాం ట్రాక్టరుకు సూచించామన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలమేరకు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తామని డీఈ తెలిపారు.

ట్రావెల్స్ బస్సుల తనిఖీ

నెల్లూరు(క్రైం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. బస్సుల పత్రాలను పరిశీలించి, డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నగరాన్ని కమ్మేసిన మబ్బులు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నెల్లూరులో రోజంతా అప్పుడప్పుడు ఎండ.. ఆ తర్వాత వాన కురిసింది. కాగా, నగరాన్ని నల్లటి మబ్బులు కమ్మేశాయి. దీనికితోడు చలిగాలులు వీచడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు.

\- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



స్వామియే శరణం అయ్యప్ప!

సంగంలోని శివాజీ సెంటర్‌లో అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. స్వామివారికి పడహారు మెట్ల ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులకు రాత్రి భిక్ష ఏర్పాటు చేశారు.

\- సంగం (ఆంధ్రజ్యోతి)

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- మత్స్యకారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు
- ఉత్సాహంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మత్స్యకార సంక్షేమ పథకాలను మత్స్యకారులు, రైతులు, సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మత్స్య దినోత్సవం సందర్భంగా నగరంలోని పురమందిరంలో జరిగిన కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన ప్రభుత్వ పథకాలను కూటమి ప్రభుత్వం రెట్టింపు సహాయం కల్పిస్తూ అమలు చేస్తోందని చెప్పారు. సముద్రంలో జెట్టీల నిర్మాణాలకు పలు ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని మత్స్యకార సంఘాలన్నీ అందరికీ ఉపయోగపడే అంశాలను వినతి పత్రం ద్వారా ఇస్తే ప్రజాప్రతినిదులమైన తామంతా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలను రాబట్టుకునేందుకు జిల్లాలోని ఎంపీలను కలవాలని మత్స్యకార సంఘాల నాయకులు, సొసైటీల అధ్యక్షులకు సూచించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మత్స్య సంపదకు గిట్టుబాటు ధర కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ద్వారా కృషి చేస్తుందన్నారు. ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు తనను కలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్ బేస్ అథారిటీ ఛైర్మన్ జెడ్ శివప్రసాద్, మత్స్యశాఖ జేడీ కే.శాంతి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొండూరు పాలిచెట్టి, డైరెక్టర్ ఎంఎఫ్‌డీబీ కోలంగారి పోలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మత్స్యకారులకు మోటార్లు, బోటు, వలలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



ప్రపంచ మత్స్య దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

బస్సులో పొగలు.. ప్రయాణికుల పరుగులు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొట్టాలు గ్రామం వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సులో పొగలు రావడంతో ప్రయాణికులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఉదయగిరి డిపోకు చెందిన బస్సు సాయంత్రం 5 గంటల సమయంలో ఉదయగిరి నుంచి విద్యార్థు లు, ప్రయాణికులతో జీ.అయ్యవారిపల్లికి బయలుదేరింది కొట్టాలు గ్రామ సమీపాని కి బస్సు చేరగానే డ్రైవర్ వద్ద ఉన్న స్విచ్ బోర్డు షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ దానిపై నీళ్ల చల్లడంతో బస్సులో పొగలు కమ్ముకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు, ప్రయాణికులు కిందకు దిగి పరుగులు తీశారు. స్విచ్ బోర్డు దగ్ధమవడంతో లైట్లు వెలగలేదు. చేసేదిలేక డ్రైవర్ వారందరినీ అక్కడే దించేసి వెళ్లిపోయాడు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు అటవీ మార్గం మీదుగా నడుస్తు విద్యార్థులు, ప్రయాణికులు ఇళ్లకు చేరుకోవాల్సి వచ్చింది.



'పల్లెవెలుగు'లో అవస్థల ప్రయాణం

- మరమ్మతులు చేయకనే రోడ్లపైకి బస్సులు
- వర్షం వస్తే ప్రయాణికులు తడవాల్సిందే!

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణం నరకంగా మారుతోంది. మరీ ముఖ్యంగా వర్షం కురిస్తేచాలు ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. జిల్లావ్యాప్తంగా 650కిపైగా ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో సగానికిపైగా పల్లెవెలుగు సర్వీసులు ఉన్నాయి. అయితే, వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండానే రోడ్లపై తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు కిటికీలు మూద్దామనుకుంటే అవి స్టక్ అయి బిగుసుకుపోయి ఉంటున్నాయి. కొన్ని బస్సుల్లో ఒక అద్దం మాత్రమే ఉండటంతో వర్షపునీరు లోపలకు వచ్చి ప్రయాణికులు తడిసిపోతున్నారు. పైకప్పులో అక్కడక్కడా రంధ్రాలు ఉండటంతో నీరంతా లోపలకు వస్తోంది. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పల్లెవెలుగు బస్సుల్లో రద్దీ ఎక్కువైంది. అయితే, ఎక్కువ శాతం బస్సులకు డోర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదపు అంచుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక బస్సుల మెయింటెన్స్ రోజు చేస్తున్నా పూర్తిస్థాయిలో స్పేర్ పార్ట్‌లు బస్సులకు బిగించకుండా పైపైనే మరమతులు చేసి తిప్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పల్లెవెలుగు సర్వీసులకు ఎక్కువ శాతం అరిగిన టైర్లు ఉండటంతో బ్రేక్‌లు వేసినా సరిగ్గా పడటంలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేమని సాక్షాత్తు కొందరు డ్రైవర్లు, మెకానిక్‌లు చెబుతున్నారు. పలు కార్మిక యూనియన్‌లు సైతం గ్యారేజ్‌లలో పూర్తిస్థాయిలో స్పేర్‌పార్ట్స్ తెప్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నాయి.

\- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



ఈ బస్సుకు డోర్ ఏమైంది!? సడన్ బ్రేక్ వేస్తే అంతేమరి!



ఈ కిటికీ అద్దం మూసుకునేనా..



ఈ తీగ ఏంటి!? ఇలా వచ్చేసింది!



ఇలాంటి రంధ్రాలు ఉంటే ప్రయాణికులు తడవరా!

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టండి

విద్యుత్ శాఖ ఎస్ఈ రాఘవేంద్రం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్తు ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ రాఘవేంద్రం అధికారులను ఆదేశించారు. విద్యుత్‌భవన్‌లో రూరల్, డివిజన్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను క్రమం తప్పకుండా చేయాల న్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలను అందించాలన్నారు. అలాగే సిబ్బంది, అధికారులు నిర్ధేశించిన సమయానికి కార్యాలయాలకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్ అధికారి మురళి, రూరల్ ఈఈలు లక్ష్మీనారాయణ, శేషాద్రి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించండి

- అధికారులకు నుడా ఛైర్మన్ ఆదేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్లు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో పని చేయాలని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. శుక్ర వారం జిల్లాలోని తహసీలార్లు, డీటీలు, పంచాయతీ కార్యదర్శులతో నుడీ వీసీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో క్రమబద్ధీకరణను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అక్రమ లేఅవుట్లకు సంబంధించి గడువు ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పిం చిందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి లో ప్రతి అధికారి బాధ్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్ రెడ్డి, పీవో హిమ బిందు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, పక్కన వీసీ వెంకటేశ్వర్లు

ప్రియురాలి కోసం ఆత్మహత్యాయత్నం

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలిని వదిలి ఉండలేనంటూ ఓ యువకుడు కలిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ఏపినాపి గ్రామానికి చెందిన కోటపాటి విష్ణువర్ధన్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమై, ఓ పాప కూడా ఉంది. విశాఖ వద్ద అనకాపల్లి సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న విష్ణువర్ధన్‌కు మరో మహిళ పరిచయమై, వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలియడంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల విష్ణువర్ధన్ తన ప్రియురాలితో కలిసి అనకాపల్లి నుంచి వచ్చి ప్రకాశం జిల్లా పామూరులోని ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న భార్య పోలీసుల సాయంతో వారిని కలిగిరి స్టేషన్‌కు తీసుకువచ్చారు. తనకు భార్య వద్దని, తాను ప్రియురాలి వద్దే ఉంటానంటూ ఆస్తి మొత్తం భార్యకు చెందేలా కాగితాలు రాసిచ్చేశాడు. అయితే, తమ కుమార్తె అదృశ్యమైనట్లు యువతి (ప్రియురాలు) తల్లిదండ్రులు ఈ నెల 16న అనకాపల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కలిగిరికి వచ్చి యువతిని తీసుకువెళ్లే ప్రయత్నంచేశారు. ఆమెను తీసుకెళితే తాను చనిపోతానంటూ స్టేషన్ ఎదుట పురుగుమందు తాగేశాడు. వెంటనే భార్య ఆయన్ను స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది.

గంజాయి ధ్వంసం

నెల్లూరు(క్రైం) : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన గంజాయిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేశారు. 64 కేసుల్లో 751 కేజీల 586 గ్రాముల డ్రై గంజాయి, 950 గ్రాముల హాషిష్ ఆయిల్, 4.2 మీటర్ల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

కూలి తీసుకుని.. గుట్టుగా జారుకుని..!

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో పలువురు ఈకేవైసీకి దూరంగా ఉన్నారు.

- 'ఉపాధి' పథకంలో అక్రమాలకు బ్రేక్
- ఈకేవైసీకి దూరంగా 1,31,718 మంది
- అక్రమాలు బయటపడతాయనే..



ఉదయగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 37 మండలాల్లో 4,90,910 మంది కూలీలు ఉండగా ఇప్పటివరకు 3,59,192 మందికి (73.54 శాతం) ఈకేవైసీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 1,31,718 మంది ఈకేవైసీకి దూరంగా ఉంటున్నారు. రికార్డుల్లో ఉన్న కూలీలు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నా వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం. ఉదయగిరి 68.91, కోవూరు 62.92, దుత్తలూరు 76.12, సీతారామపురం 65.78 శాతం చొప్పున మాత్రమే ఈకేవైసీ పూర్తయ్యింది. పలు ప్రాంతాల్లో వలస వాసులు అధికం. వారంతా ఇతర ప్రాంతాల్లో ఉన్నా ఇక్కడ ఉపాధి హామీ పనికి వచ్చినట్లు మస్టర్ వేస్తూ నగదు స్వాహా చేస్తున్నారు. మిగిలిన వారి కోసం సిబ్బంది గ్రామాల్లో గాలింపు చేస్తున్నారు.

- వివరాల సేకరణలో అధికారులు

ఉపాధి హామీ పథకంలో చేయని పనులు చేసినట్లు కొన్ని చోట్ల నమోదు చేశారు. పనికి రాకున్నా వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమల్లోకి తెచ్చినా దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. దీంతో అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్థానికంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగుల పేర్లతో గ్రామాల్లో వేతనాలు స్వాహా చేశారనే విషయం సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడంలేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో వారంతా ఈకేవైసీకి దూరంగా ఉన్నట్లు సమాచారం. ఈకేవైసీకి దూరంగా ఉన్న వారి వివరాలను సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈకేవైసీ పూర్తయిన తరువాతనే వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రదేశంలో ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.



రామస్వామిపాలెం దళితవాడలో బురదమయంగా రోడ్డు

కొద్దిపాటి వర్షానికే ఇలా...

బిట్రగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం దళితవాడలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో పైప్‌లైన్ వేశారు. అయితే పైప్‌లైన్ కోసం తీసిన కాలువ గుంట సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదాలు జరుగక ముందే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : డీఈవో

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రాజా బాలాజీరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సంగం మండలంలోని మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఆర్‌డీవో రాజేష్ సైంటిస్ట్ బృందం పాఠశాలకు అందచేసిన వాటర్ కూలర్, ల్యాబ్ పరికరాలు, సౌండ్ సిస్టం, లైబ్రరీ బుక్స్, పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ తదితర సామగ్రిని విద్యార్థులకు అందచేశారు. ఈసందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. దాతలను అభినందించారు. అదేవిధంగా అజయ్‌రెడ్డి బృందం విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకిరామ్, ఎంఈవో 2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రాజా బాలాజీరావు

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2002 నుంచి 2005 మధ్య నమోదైన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ కూడా చేపట్టినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా నవీకరణ జరుగుతుందని, ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, రసూల్(టీడీపీ), శ్రీనివాస్(బీజేపీ), వెంకట శేషయ్య (వైసీపీ), శ్రీరామ్(బీఎస్పీ), బాలసుధాకర్(కాంగ్రెస్) పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ శుక్లా, డీఆర్వో

- ఉద్యోగుల గ్రీవెన్స్

ఉద్యోగుల కోసం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ శుక్లా స్వయంగా ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతీ ఉద్యోగితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 22 మంది ఉద్యోగులు వినతులిచ్చారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- కారుణ్య నియామక ఉత్తర్వులు...

ముగ్గురు మహిళలకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తూ కలెక్టర్ శుక్లా నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.

- అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు (2026-27) రెండేళ్ల కాలానికి సమాచార పౌరసంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:మీడియా రిలేషన్స్‌ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈనెల ఆఖరుతో ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

- విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరపాలి

నెల్లూరు(వైద్యం) : మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామా అంకయ్య మాట్లాడుతూ 14 ఏళ్ల బాలిక మృతి అనుమానాస్పదంగా ఉందని, పాఠశాల అధికారులు మాత్రం ఆత్మహత్యని చెబుతున్నారన్నారు. ఆ విద్యాసంస్థ నిర్లక్ష్యం, మానసిక వేధింపుల కారణంగా బాలిక మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పోస్టుమార్టం మహిళా వైద్యులు కాకుండా పురుష డాక్టర్ నిర్వహించటంపై బాలిక తల్లిదండ్రులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు, సిరాజ్, షాన్‌వాజ్, ముక్తియార్, షాజహాన్, అహమద్, రియాజ్, మునివర్ తదితరులు పాల్గొన్నారు.

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.